# యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్ (UPF)

1-9-52/E/3, రాంనగర్, హైదరాబాద్ - 500 020. (T.S.) INDIA. Ph.: 9550504718, 9030757571

# దెబోరా స్వరం

సంపుటి : 16 సంచిక : 5 సెప్టెంబరు - అక్టోబరు 2023 విడి ప్రతి వెల రూ. 5/- సం॥ర చందా రూ॥ 100/-


## హృదయ పరీక్ష శీర్షిక నుండి 26. పరిశుద్ధాత్మను దుఃఖపరచుట - జాయ్ చెరియన్

*సంపాదకురాలి కలమునుండి...*

దెబోరాస్వరం పాఠకులకందరికీ క్రీస్తు నామమున శుభములు.

రక్షింపబడిన దేవుని బిడ్డలకు తండ్రియైన దేవుని ప్రేమ, యేసుక్రీస్తు కృప పరిశుద్ధాత్మ దేవుని అన్యోన్య సహవాసము ఎల్లప్పుడు తోడుగా ఉంటాయి. యేసుక్రీస్తు పరలోకమునకు ఆరోహణమైన తరువాత మనలను దిక్కులేని అనాథలుగా విడిచిపెట్టకుండ ఆదరణకర్తయగు పరిశుద్ధాత్మ దేవుని అనుగ్రహించాడు. సత్యస్వరూపియగు ఆత్మ ఎల్లప్పుడు మనలను సర్వసత్యములోనికి నడిపిస్తాడు. పరిశుద్ధాత్మ దేవుడు మనలను ప్రేమించి, ఆదరించి, ఆలోచనలిచ్చి నడిపిస్తున్నాడు. పరిశుద్ధాత్మను దుఃఖపరిస్తే నిన్ను వదిలిపోతాడు. అందుకే పరిశుద్ధాత్మను దుఃఖపరచే ఏ పని చేయకూడదు.

పరిశుద్ధాత్మకు చిహ్నము పావురము. పావురములో ఏ చేదు ఉండదు. విశ్వాసులు పాపము చేయకుండ ఉన్నప్పుడే పరిశుద్ధాత్మ దేవుడు మన హృదయంలో నివసిస్తాడు. నా చిన్నతనములో మా నాన్నగారు ఓ ప్రసంగములో ఇలా చెప్పారు. పరశుద్ధాత్మకు రెండు రెక్కలున్నాయి. నీవు ఆహ్వానించినప్పుడు రెక్కలు కొట్టుకొంటు నీయొద్దకు వచ్చివాలుతాడు. దుఃఖపరిస్తే నీయొద్దనుండి ఎగిరి వెళ్లిపోతాడు. కాబట్టి నీ క్రియలద్వారా, తలంపులద్వారా పరిశుద్ధాత్మను దుఃఖపరచకూడదు.

దేవుడు మనలను ఎంతో ప్రేమిస్తున్నాడు గనుక మనలోని చెడుతనమును చూచి దుఃఖపడతాడు.

**“నరుల చెడుతనము భూమిమీద గొప్పదనియు, వారి హృదయము యొక్క తలంపులలోని ఊహ అంతయు ఎల్లప్పుడు కేవలము చెడ్డదనియు యెహోవా చూచి తాను భూమిమీద నరులను చేసినందుకు యెహోవా సంతాపము నొంది తన హృదయములో నొచ్చుకొనెను.”** – ఆదికాం. 6:5,6

ఇశ్రాయేలు ప్రజలు దేవుడు చేసిన మేలులన్నీ మరచిపోతు దేవునికి విరోధముగా తిరుగుబాటు చేసి దేవుని దుఃఖపరచినందున దేవుడే వారికి విరోధి అయ్యాడు.

**“వారి యావద్బాధలో ఆయన బాధనొందెను ఆయన సన్నిధి దూత వారిని రక్షించెను. ప్రేమచేతను తాలిమిచేతను వారిని విమోచించెను పూర్వదినములన్నిటను ఆయన వారిని ఎత్తికొనుచు మోసికొనుచు వచ్చెను. అయినను వారు తిరుగుబాటు చేసి ఆయన పరిశుద్ధాత్మను దుఃఖింపజేయగా ఆయన వారికి విరోధియాయెను తానే వారితో యుద్ధము చేసెను.”**

– యెషయా 63:9,10

**“అరణ్యమున వారు ఆయనమీద ఎన్నిమారులో తిరుగబడిరి ఎడారియందు ఆయనను ఎన్నిమారులో దుఃఖపెట్టిరి. మాటిమాటికి వారు దేవుని శోధించిరి. మాటిమాటికి ఇశ్రాయేలు పరిశుద్ధదేవునికి సంతాపము కలిగించిరి. ఆయన బాహుబలమునైనను విరోధులచేతిలోనుండి ఆయన తమ్మును విమోచించిన దినమునైనను వారు స్మరణకు తెచ్చుకొనలేదు. ఐగుప్తులో తన సూచకక్రియలను సోయను క్షేత్రమందు తన అద్భుతములను ఆయన చూపిన దినమును వారు జ్ఞప్తికి తెచ్చుకొనలేదు.”**

– కీర్తనలు 78:40-43

దేవుడు చేసిన ఉపకారములు మరచిపోకుండా జ్ఞాపకము చేసికొని దేవుని స్తుతించాలి, అలా చేయకుంటే పరిశుద్ధాత్ముడు దుఃఖిస్తాడు.

**“కాబట్టి అన్యజనులు నడుచుకొనునట్లు మీరికమీదట నడుచు కొనవలదని ప్రభువునందు సాక్ష్యమిచ్చుచున్నాను. వారైతే అంధకారమైన మనస్సుగలవారై, తమహృదయ కాఠిన్యమువలన తమలోనున్న అజ్ఞానము చేత దేవునివలన కలుగు జీవములోనుండి వేరుపరచబడినవారై, తమ మనస్సునకు కలిగిన వ్యర్థత అనుసరించి నడుచుకొనుచున్నారు. వారు సిగ్గులేనివారైయుండి నానావిధమైన అపవిత్రతను అత్యాశతో జరిగించుటకు తమ్మును తామే కాముకత్వమునకు అప్పగించుకొనిరి. అయితే మీరు యేసునుగూర్చి విని, ఆయనయందలి సత్యము ఉన్నది ఉన్నట్టుగానే ఆయనయందు ఉపదేశింపబడినవారైనయెడల, మీరాలాగు క్రీస్తును నేర్చుకొన్నవారుకారు. కావున మునుపటి ప్రవర్తన విషయములోనైతే, మోసకరమైన దురాశలవలన చెడిపోవు మీ ప్రాచీన స్వభావమును వదలుకొని మీ చిత్తవృత్తియందు నూతనపరచబడినవారై, నీతియు యథార్థమైన భక్తియుగలవారై, దేవుని పోలికగా సృష్టింపబడిన నవీనస్వభావమును ధరించుకొనవలెను.”** – ఎఫెసీ. 4:17-24

విశ్వాసి అన్యజనుల వ్యర్థపు ప్రవర్తనను అనుసరిస్తే పరిశుద్ధాత్మ దేవుడు దుఃఖపడతాడు. అన్యజనులకు వెలుగుగా నియమింపబడిన నీవు వారితో సహవాసము చేస్తు వారి పద్ధతులు ఆచారములను అనుసరిస్తే పరిశుద్ధాత్మ దేవుడు దుఃఖపడతాడు. అంధకారములో చీకటిలో మార్గము తెలియకుండ అజ్ఞానదశలో దేవునినుండి వేరైన అన్యజనులను విశ్వాసిగా సత్యమార్గములో నడిపించాలి గాని వారిని అనుసరించకూడదు. నీలో నున్న వెలుగు విశ్వాసము వారికి అంటుకోవాలి. నీవు వారిని రక్షణ మార్గములో నడిపించాలి. ఆ శక్తి నీకు లేకుండ వారితో సహవాసము చేసి వారి పద్ధతులు ఆచరిస్తూ, విగ్రహారాధన జరిగిస్తే పరిశుద్ధాత్మ దేవుడు దుఃఖపడతాడు. జీవముగల దేవుని విడచి మంత్రతంత్రములను ఆశ్రయించావంటే పరిశుద్ధాత్ముడు దుఃఖపడతాడు. అపవిత్రమైన దానిని జరిగిస్తూ మిమ్మును మీరు కాముకత్వమునకు అప్పగించుకుంటే పరిశుద్ధాత్ముడు దుఃఖపడతాడు. కాబట్టి మోసకరమైన దురాశలవలన చెడిపోవు మీ ప్రాచీన స్వభావమును విడచిపెట్టి యేసు రక్తములో కడుగబడి పరిశుద్ధపరచబడాలి. నీతియు యథార్థమైన భక్తియు కలిగినవారై నవీనస్వభావమును ధరించుకోవాలి. ఎవడైనను క్రీస్తుయేసునందున్నయెడల వాడు నూతనసృష్టిగా మార్చ బడతాడు. మనము ఏదైనా వస్తువు కొనేముందు ఐ.ఎస్.ఐ. ముద్ర ఉందా, లేదా అని చూస్తాము. ఆలాగుననే విశ్వాసులు పరిశుద్ధాత్మయందు ముద్రింపబడాలి.

**“మీరును సత్యవాక్యమును, అనగా మీ రక్షణ సువార్తను విని, క్రీస్తునందు విశ్వాసముంచి, వాగ్దానము చేయబడిన ఆత్మచేత ముద్రింపబడితిరి. దేవుని మహిమకు కీర్తి కలుగుటకై ఆయన సంపాదించుకొనిన ప్రజలకు విమోచనము కలుగు నిమిత్తము ఈ ఆత్మ మన స్వాస్థ్యమునకు సంచకరువుగా ఉన్నాడు.”** – ఎఫెసీ. 1:13,14

విమోచన దినమువరకు మన స్వాస్థ్యమునకు పరిశుద్ధాత్ముడు సంచకరువుగా ఉండి మనలను సురక్షితముగా కాపాడుతున్నాడు. కాబట్టి అన్యజనుల వ్యర్థప్రవర్తనను అనుసరించి పరిశుద్ధాత్మను దుఃఖపరచకూడదు. పరిశుద్ధాత్మను ఆర్పవద్దు.

**“ఆత్మను ఆర్పకుడి.”** – 1 థెస్సలో. 5:19

పరిశుద్ధాత్ముడు అగ్నితో పోల్చబడ్డాడు. పరిశుద్ధాత్మ అగ్నిని ఆర్పకూడదు. మనము దేవునికి విరోధమైన పనులు చేస్తు పాపము చేసినప్పుడు నీలో పరిశుద్ధాత్మ అగ్ని ఆరిపోతుంది. పరిశుద్ధాత్ముడు మనలో ప్రజ్వలించాలి గాని ఆరిపోకూడదు. అవిధేయులమై దేవుని మాట వినకపోతే, పరిశుద్ధాత్ముడు నీలోనుండి వెళ్లిపోతాడు. విధేయులైనవారే పరిశుద్ధాత్మ శక్తిని పొందుతారు. కాబట్టి దేవుని మాటకు విధేయులము కావాలి. మన తలంపులు క్రియలు పరిశుద్ధముగా దేవుని చిత్తనుసారముగా నున్నప్పుడు పరిశుద్ధాత్ముడు నీలో ప్రజ్వలిస్తాడు. అందుకే అపొ.పౌలు ఆత్మను ఆర్పకుడి అంటూ హెచ్చరిస్తున్నాడు. పరిశుద్ధాత్మను కోల్పోతే అంతకన్న దౌర్భాగ్యపు స్థితి నీకుండదు. అందుకే దావీదు భక్తుడు నీ పరిశుద్ధాత్మను నాయొద్దనుండి తీసివేయకుమని ప్రార్థిస్తున్నాడు.

**“నీ సన్నిధిలోనుండి నన్ను త్రోసివేయకుము నీ పరిశుద్ధాత్మను నాయొద్దనుండి తీసివేయకుము.”** – కీర్తనలు 51:11

యేసుప్రభువే పాపులతో సుంకరులతో సాంగత్యము చేశాడు. నేను చేస్తే ఏమవుతుందని అనుకోకు. పాపులతో సహవాసము చేశాడు ఎందుకంటే వారిని రక్షించి పరిశుద్ధ మార్గములోకి తీసికొని రావడానికే. పాపులను ప్రేమించాడు, రక్షించాడు గాని ఆయనలో ఏ పాపము లేదు. కాబట్టి నీవు పాపులను రక్షణ మార్గములోకి నడిపించాలి గాని వారి పాపములలో నీవు పాలివాడవు కాకూడదు. పరిశుద్ధాత్మను దుఃఖపరచ కూడదు.

**“మనము ఒకరికొకరము అవయవములై యున్నాము. గనుక మీరు అబద్ధమాడుట మాని ప్రతివాడును తన పొరుగువానితో సత్యమే మాటలాడవలెను.”** – ఎఫెసీ. 4:25

విశ్వాసి అబద్ధమాడితే పరిశుద్ధాత్ముడు దుఃఖపడతాడు. సాతానుడు అబద్ధికుడు, అబద్ధములకు జనకుడు, అబద్ధమాడుట సాతాను స్వభావము. సత్యవంతుడైన దేవుని పిల్లలముగా సత్యమే పలకాలి. సత్యస్వరూపి అయిన ఆత్మ నిన్ను సర్వసత్యములోనికి నడిపిస్తాడు. నీ పొరుగువానితో నీవు సత్యము మాటలాడినప్పుడు పరిశుద్ధాత్ముడు నీయందు ఆనందిస్తాడు.

**“కోపపడుడి గాని పాపము చేయకుడి; సూర్యుడస్తమించువరకు మీ కోపము నిలిచియుండకూడదు. అపవాదికి చోటియ్యకుడి;”** – ఎఫెసీ. 4:26,27

విశ్వాసి కోపపడకూడదు. నీవు ఒక వేళ ఏదైనా కార్యము జరుగడానికి కోపగించినా, ఆ కోపము నీలో నిలిచియుండకూడదు. యేసుప్రభువుకూడ మందిరములో క్రయ విక్రయములు జరుగుట చూచి కోపగించాడు గాని వెంటనే కనికరపడి దేవాలయములో నున్న కుంటివారిని గ్రుడ్డివారిని ముట్టి బాగుచేశాడు. దేవుని కోపము నిమిషమాత్రము దయ ఆయుష్కాలమంతా ఉంటుంది. నీవుకూడ ఇలాగే ఉండాలి. నీలో కోపము ద్వేషముంటే పరిశుద్ధాత్మ దేవుడు దుఃఖపడతాడు. పరిశుద్ధ హృదయంలోనే పరిశుద్ధాత్ముడు ఉంటాడు. పాపముతో నిండిన అపవిత్రమైన హృదయంలో ఆయన నివసింపడు. కాబట్టి విశ్వాసి పావురమువలె సున్నితమైన మనస్తత్వము కలిగియుండాలి. పరిశుద్ధమైన ప్రవర్తన కలిగియుండాలి.

**“దొంగిలువాడు ఇకమీదట దొంగిలక అక్కరగలవానికి పంచిపెట్టుటకు వీలుకలుగు నిమిత్తము తన చేతులతో మంచి పనిచేయుచు కష్టపడవలెను.”** – ఎఫెసీ. 4:28

విశ్వాసి కష్టపడి పనిచేయాలి. దేవుడు నీ చేతుల కష్టార్జితమును ఆశీర్వదిస్తాడు. దొంగతనము చేయడము, పరుల సొమ్ము నాశించడము చేస్తే పరిశుద్ధాత్ముడు దుఃఖిస్తాడు.

**“వినువారికి మేలు కలుగునట్లు అవసరమునుబట్టి క్షేమాభివృద్ధికరమైన అనుకూలవచనమే పలుకుడి గాని దుర్భాషయేదైనను మీ నోట రానియ్యకుడి.”** – ఎఫెసీ. 4:29

మీ నోటి మాటలు మృదువుగా కృపాసహితముగా ఉండి వినువారికి క్షేమాభివృద్ధి కలుగజేయాలి. నీ మాటలద్వారా ఇతరులు ఆదరింపబడాలి. ధైర్యము పొందాలి. విశ్వాసి నోట బూతులు చెడ్డమాటలు మానుకోవాలి. నీ నోరు నాలుక అపవిత్రమైతే పరిశుద్ధాత్ముడు నీలో నివసింపడు.

**“కృతజ్ఞతావచనమే మీరుచ్చరింపవలెను గాని మీరు బూతులైనను, పోకిరిమాటలైనను, సరసోక్తులైనను ఉచ్చరింపకూడదు; ఇవి మీకు తగవు.”** – ఎఫెసీ. 5:4

విశ్వాసులు పోకిరిమాటలతో, సరసోక్తులతో సమయము వ్యర్థము చేయకూడదు. కొందరు జోక్స్ అని చెప్పి పెద్దగా నవ్వుతుంటారు. సంతోషించుటలో తప్పు లేదు గాని వ్యర్థమైనవాటియందు ఆనందించక దేవునియందు ఆనందించాలి. ఎల్లప్పుడు కృతజ్ఞతావచనమే నీ నోటినుండి రావాలి. బూతులు, పోకిరిమాటలు, సరసోక్తులు మాట్లాడితే పరిశుద్ధాత్ముడు దుఃఖపడి నిన్ను విడిచిపోతాడు.

**"దేవుని పరిశుద్ధాత్మను దుఃఖపరచకుడి; విమోచనదినమువరకు ఆయనయందు మీరు ముద్రింపబడియున్నారు. సమస్తమైన ద్వేషము, కోపము, క్రోధము, అల్లరి, దూషణ, సకలమైన దుష్టత్వము మీరు విసర్జించుడి."** – ఎఫెసీ. 4:30,31

ద్వేషము, కోపము, క్రోధము, అల్లరి, సకలమైన దుష్టత్వమును విశ్వాసులు విసర్జించాలి. ఇవి నీలో ఉంటే నీ దేహమును పాడు చేస్తాయి. నీవు ఏదైనా అనారోగ్యమునకు లోనై వైద్యుల దగ్గరకు వెళితే నీకు ఏదైన మానసికమైన ఒత్తిడి లేదా ఎవరితోనైనా శత్రుత్వము ఉందా? అని ప్రశ్నిస్తారు. దేహము దేవుని ఆలయం, జీవముగల దేవుడు మన మధ్యలో సంచరిస్తున్నాడు. మనము పరిశుద్ధాత్ముడు నివసించే ఆలయమై యున్నాము. మంటి ఘటమైన మన దేహములో పరిశుద్ధాత్మ అనే మహిమైశ్వర్యమును నింపాడు. అందుకే దావీదు భక్తుడు పరిశుద్ధాత్మను నాయొద్దనుండి తీసివేయకుమని అంటున్నాడు. రాజ్యము, కిరీటము, సింహాసనము పోయినను పరిశుద్ధాత్మను తీసివేయకుమని అంటున్నాడు. పరిశుద్ధాత్ముడు నిన్ను విడిచిపోతే అంతకు మించిన నష్టము నీకు లేదు. అందుకే పరిశుద్ధాత్మను దుఃఖపరిచేవన్నిటిని తొలగించుకోవాలి.

**"ఒకని యెడల ఒకడు దయగలిగి కరుణాహృదయులై క్రీస్తునందు దేవుడు మిమ్మును క్షమించినప్రకారము మీరును ఒకరినొకరు క్షమించుడి."** – ఎఫెసీ. 4:32

మనము ఒకరినొకరము వెంటవెంటనే క్షమించుకోవాలి. మనము చేసిన పాపములన్ని దేవుడు లెక్కపెట్టి నిలదీసి అడిగితే మనము దేవుని సన్నిధిలో నిలువలేము. దేవుడు మన అపరాధములను క్షమించిన ప్రకారము మనముకూడ ఇతరులను క్షమించాలి. కోపము, ద్వేషము కలిగియుండవద్దు. నీవు ఇతరులను క్షమించకుండ అంతరంగములో పగ, ద్వేషము పెట్టుకుంటే పరిశుద్ధాత్ముడు దుఃఖిస్తాడు; చిన్న బిడ్డవంటి నిర్మలమైన మనస్సు కలిగి ఒకరియెడల ఒకరు దయగలిగి కరుణాహృదయులై యుండాలి.

**"మీలో జారత్వమేగాని, యే విధమైన అపవిత్రతయే గాని, లోభత్వమేగాని, వీటి పేరైనను ఎత్తకూడదు, ఇదే పరిశుద్ధులకు తగినది."** – ఎఫెసీ. 5:3

విశ్వాసికి ఏవి తగినవి? ఏవి తగనివో పరిశుద్ధ గ్రంథము స్పష్టముగా తెలియజేస్తుంది. కాబట్టి పరిశుద్ధతకు తగినట్లు జీవించాలి. జారత్వము, అపవిత్రత, లోభత్వమును తొలగించుకోవాలి. ఇట్టి అపవిత్రత నీలో ఉంటే పరిశుద్ధాత్ముడు నీలో నివసించడు. దుఃఖపడి నిన్ను విడిచిపోతాడు.

వ్యభిచారియైనను అపవిత్రుడైనను విగ్రహారాధికుడైనను లోభియైనను దేవుని రాజ్యమునకు హక్కుదారులు కారు. ఇట్టివారిలో పరిశుద్ధాత్ముడు నివసింపడు.

పరిశుద్ధాత్మను దుఃఖపరిస్తే నీకు ఎన్నో నష్టములు సంభవిస్తాయి. పరిశుద్ధాత్ముడు దుఃఖపడి నిన్ను విడిచిపోతే దేవునితో ఉన్న సంబంధమును కోల్పోయి ఒంటరివైపోతావు. రక్షణ నిశ్చయతను కోల్పోతావు. దేవుని వాక్యముమీద ఆసక్తి కోల్పోతావు. దేవుని వాక్యము చదవాలనిపించదు; వినబుద్ధికాదు. జబ్బు కలిగితే ఆహారం ఎలాగు రుచించదో అలాగే పరిశుద్ధాత్ముడు నీలో లేకుంటే వాక్యముపట్ల ఆసక్తి ఉండదు. సమస్యలలో నిలిచే శక్తి నీకుండదు; గుండె కొట్టుకొని తల బాదుకొని ఏడుస్తారు. అందుకే పరిశుద్ధాత్మను దుఃఖపరచకూడదు. పరిశుద్ధాత్మశక్తి నీలో ఉంటే సమస్యలు, శ్రమలు సహించి వాటిని జయిస్తావు. పదివేల మంది నీమీదకు దండెత్తి వచ్చినా నీవు ధైర్యముగా ఉంటావు. పరిశుద్ధాత్ముడు నీలో లేకుంటే ఆత్మఫలము ఫలించలేవు. లోకము నీలో పరిశుద్ధాత్మ ఫలములు చూడలేదు. ఏది సరియైనది, ఏది తప్పు అని తెలిసికొనే విచక్షణశక్తిని కోల్పోతావు. పరిశుద్ధాత్మ సహవాసం లేకుంటే నీ ముందున్న మార్గము నీకు సరియైనదిగా కనబడుతుంది గాని అది చివరకు నీ మరణమునకు దారితీస్తుంది. కాబట్టి పరిశుద్ధాత్మను దుఃఖపరచకుండ పరిశుద్ధాత్మకు విరోధముగా ఏ పాపము చేయకుండ మన ప్రవర్తన జాగ్రత్తగా కాపాడుకోవాలి.



**ప్రార్థన:** ప్రభువా, నీ పరిశుద్ధాత్మను దుఃఖ పరచకుండ మాకు సహాయం చేయండి. నీ చిత్తానుసారముగా నడుచుకొనే కృపనివ్వమని యేసు నామములో అడుగుతున్నాము తండ్రీ. ఆమేన్!

## UPF Bank Account Details

### Union Bank of India Account Details

| | | |
|---|---|---|
| Account No. | : | **133911100000946** |
| Account Type | : | **Current Account** |
| Account Name | : | **United Peoples Fellowship** |
| Account Branch | : | **Ramnagar, Hyderabad.** |
| IFSC Code | : | **UBIN0813397** |

### State Bank of India Account Details

| | | |
|---|---|---|
| Account No. | : | **67088374386** |
| Account Type | : | **Current Account** |
| Account Name | : | **United Peoples Fellowship** |
| Account Branch | : | **Ramnagar, Hyderabad.** |
| IFSC Code | : | **SBIN0012917** |

**చెక్కులు : United Peoples Fellowship**

**యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్ పేరుతో**

**(చెక్కు వెనుక మీ పేరు మరియు ఫోన్ నెంబర్ తప్పక వ్రాయగలరు)**

**Phone Pe / G Pay : 7901236907**

**POS : Card Swipe**

# దేవుని సహస్రనామములు

## 367. మనుష్యులవలన విసర్జింపబడినవాడు

– యెషయా 53:3

**“అతడు తృణీకరింపబడినవాడును ఆయెను. మనుష్యులవలన విసర్జింపబడినవాడును వ్యసనాక్రాంతుడుగాను వ్యాధి ననుభవించిన వాడుగాను మనుష్యులు చూడనొల్లనివాడుగాను ఉండెను.”**

– యెషయా 53:3

యేసు ప్రభువును మనుష్యులు తృణీకరించారు. విసర్జించారు. ప్రభువును లెక్కలోకి తీసికోకుండ, ప్రభువు నామమెత్తడముకూడ వారికిష్టములేనట్లు ప్రవర్తించి బొత్తిగా విసర్జించారు. ప్రవక్తల లేఖనముల నెరవేర్పు జరుగునట్లు ప్రభువు మనుష్యులవలన విసర్జింపబడ్డాడు. ప్రభువు సిలువ మరణమునుగూర్చి 700 సంవత్సరముల పూర్వమే యెషయా ప్రవక్త ప్రవచించాడు. యెషయా 53వ అధ్యాయమంతా ప్రభువు సిలువమరణముగూర్చిన ప్రవచన వాక్కులే. దావీదు భక్తుడుకూడ సిలువ మరణమునకు 1000 సంవత్సరముల పూర్వమే ప్రవచించాడు. 22వ కీర్తన ప్రభువు సిలువ మరణమునకు చెందిన ప్రవచన వాక్కులే.

యేసుప్రభువు మనుష్యులవలన విసర్జింపబడతాడని తృణీకరింప బడతాడని, ఒంటరి వాడయిపోతాడని ముందే ప్రవచింపబడింది. అతడు నరుడుకాదు పురుగని దావీదు అంటాడు. పురుగంటే ఏవిధముగా చీదరించుకొని విసర్జిస్తామో అలాగే ప్రభువు విసర్జింపబడ్డాడు. సిలువలో యేసుప్రభువు తన్ను తాను రిక్తునిగా చేసికున్నాడు.

**“నేను నరుడను కాను నేను పురుగును నరులచేత నిందింపబడినవాడను ప్రజలచేత తృణీకరింపబడినవాడను. నన్ను చూచువారందరు పెదవులు విరిచి తల ఆడించుచు నన్ను అపహసించుచున్నారు.”** – కీర్తనలు 22:6,7

ప్రభువు – తృణీకరింపబడినవాడు, విసర్జింపబడినవాడు. వ్యసనాక్రాంతుడు. దుఃఖాక్రాంతుడు. మనుష్యులు చూడనొల్లనివాడుగా మారిపోయాడెందుకు? అతనికి సురూపమైనను సొగసైనను లేదెందుకు? ఎండిన భూమిలో మొలిచిన లేత మొక్కవలే అయిపోయాడెందుకంటే మనకొరకే. ఒక గింజ భూమిలో పడి చనిపోయి మొక్కగా మారుతుంది. అలాగునే యేసుప్రభువు సిలువలో ప్రాణము పెట్టి మూడవ రోజు తిరిగి పునరుత్థానుడయ్యాడు. నిత్యమరణమునుండి మనలను రక్షించి నిత్యజీవమివ్వడానికే ప్రభువు మనుష్యులవలన విసర్జింపబడ్డాడు.

**“అందుకు యేసు వారితో ఇట్లనెను – మనుష్యకుమారుడు మహిమ పొందవలసిన గడియ వచ్చియున్నది. గోధుమగింజ భూమిలో పడి చావకుండిన యెడల అది ఒంటిగానే యుండును; అది చచ్చిన యెడల విస్తారముగా ఫలించును. తన ప్రాణమును ప్రేమించువాడు దానిని పోగొట్టుకొనును; ఈ లోకములో తన ప్రాణమును ద్వేషించువాడు నిత్యజీవముకొరకు దానిని కాపాడుకొనునని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను.”** – యోహాను 12:23-25

గోధుమగింజ చూడటానికి చక్కని ఆకారములో ఉంటుంది. దాని ఆకారము మారకుండ అది భూమిమీద అలాగే ఉంటే ఫలించదు. ఫలించాలంటే గోధుమగింజ భూమిలో పడి చనిపోతేనే విస్తారముగా ఫలిస్తుంది. భూమిలో పడగానే గింజ ఆకారములో మార్పు వస్తుంది. గింజ చనిపోయి, ఆకారము కోల్పోయి మూడవ రోజు పచ్చని మొలక భూమి మీద కనబడుతుంది. ఆలాగునే యేసుప్రభువు సిలువలో తన సొగసును, సురూపమును కోల్పోయాడు. అందరిచేత తృణీకరింపబడి విసర్జింపబడ్డాడు. అందరిచేత అవమానమును, బాధను అనుభవించి వ్యసనాక్రాంతుడిగా వ్యాధిగ్రస్తుడిగా మారిపోయాడు. తన్ను తాను రిక్తునిగా చేసికొని సిలువ మరణమునకు అప్పగించుకున్నాడు. సిలువలో మరణించి మరల మూడవరోజు పునరుత్థానుడయ్యాడు. గోధుమగింజ భూమిలో పడి చస్తే ఏ విధముగా ఫలిస్తుందో యేసుప్రభువు సిలువ మరణ పునరుత్థానముల ద్వారా ఈ భూమిమీద ప్రభువును అంగీకరించినవారు, రక్షకుడిగా స్వీకరించినవారి సంఖ్య లెక్కించడానికి వీలుకాదు. ఆదివారపు ఆరాధనలో ఎంత మంది దేవుని వాక్యము వింటున్నారో లెక్కించడము అసాధ్యము. ప్రభువువలన మేలు పొందినవారు అనేకులున్నారు. ఈ లోకములో ప్రభువు సువార్త పరిచర్య నిమిత్తము నీ రూపము, ఆరోగ్యము కోల్పోయినంతగా శ్రమపడుతున్నావా? తృణీకరింపబడి, విసర్జింపబడుతున్నావా? దేవుడు గొప్ప ఫలము నీకనుగ్రహిస్తాడు. యేసుప్రభువు మనకంటే ముందు సిలువ శ్రమలనుభవించాడు. తృణీకరింపబడి మనుష్యులవలన విసర్జింపబడ్డాడు. అయినను పరమతండ్రియైన దేవుని చిత్తమును భూమిపై సంపూర్ణముగా నెరవేర్చాడు. పరలోకమందు తండ్రి కుడి పార్శ్వమున కూర్చునే ఆ గొప్ప భాగ్యము విడిచి నీకొరకు నాకొరకు తన్ను తాను రిక్తునిగా చేసికొన్నాడు.

**“ఆయన దేవుని స్వరూపము కలిగినవాడైయుండి, దేవునితో సమానముగా ఉండుట విడిచిపెట్టకూడని భాగ్యమని యెంచుకొనలేదు గాని మనుష్యుల పోలికగా పుట్టి, దాసుని స్వరూపమును ధరించుకొని, తన్ను తాను రిక్తునిగా చేసికొనెను. మరియు, ఆయన ఆకారమందు మనుష్యుడుగా కనబడి, మరణము పొందునంతగా, అనగా సిలువ మరణము పొందునంతగా విధేయత చూపినవాడై, తన్నుతాను తగ్గించు కొనెను. అందుచేతను పరలోకమందున్నవారిలో గాని, భూమిమీద ఉన్నవారిలో గాని, భూమి క్రింద ఉన్నవారిలో గాని, ప్రతివాని మోకాలును యేసునామమున వంగునట్లును, ప్రతివాని నాలుకయు తండ్రియైన దేవుని మహిమార్థమై యేసుక్రీస్తు ప్రభువని ఒప్పుకొనునట్లును, దేవుడు ఆయనను అధికముగా హెచ్చించి, ప్రతి నామమునకు పైనామమును ఆయనకు అనుగ్రహించెను.”** – ఫిలిప్పీ. 2:6-11

మనందరి రక్షణార్థము మనుష్యులవలన విసర్జింపబడి, తృణీకరింప బడిన ప్రభువు, తన సొగసు, సురూపము కోల్పోయి తన ప్రాణమును సిలువలో మనకై పాపపరిహారార్థ బలిగా అర్పించాడు. రక్తమంతా చిందించాడు. తండ్రియైన దేవుని చిత్తమును భూమిమీద సంపూర్ణముగా నెరవేర్చాడు. తండ్రియైన దేవుడు యేసుప్రభువుని అధికముగా హెచ్చించాడు. ప్రతివాని మోకాలు యేసునామములో వంగునట్లు, ప్రతి నాలుక దేవుని మహిమపరచునంతగా హెచ్చించాడు.

యెషయా ప్రవక్త – మేము తెలియజేసిన సమాచారము ఎవడు నమ్మెను అంటున్నాడు. యేసుక్రీస్తు రక్షకుడంటే ఎవరూ నమ్మడము లేదు. సర్వమానవాళి రక్షణ నిమిత్తము, నశించిన దానిని వెదకి రక్షించడానికే, పాపులను రక్షించడానికే క్రీస్తుయేసు ఈ లోకమునకు వచ్చాడనే సత్యము నమ్మదగినది, పూర్ణాంగీకారమునకు యోగ్యమైనదని పౌలు అంటున్నాడు. ఒకప్పుడు ప్రభువును విసర్జించి, సంఘమును హింసించిన సౌలు భక్తకోటికి అపొస్తలుడిగా మారిపోయాడు. రాక్షస స్వభావము గలవాడు పరిశుద్ధుడైన పౌలుగా మారిపోయాడు. పాపులను, నశించినదానిని వెదకి రక్షించడానికే ప్రభువు వచ్చాడు. పాపులలో ప్రధానుడైన నన్ను పరిశుద్ధుడిగా మార్చాడని సాక్ష్యమిస్తున్నాడు.

ప్రజలను వారి పాపములనుండి రక్షించే రక్షకుడుదయించాడనే సమాచారము ఎవరూ నమ్మడము లేదు అని ప్రవక్త చెప్పిన వాక్యము నెరవేరునట్లు యేసుక్రీస్తు మనుష్యులవలన విసర్జింపబడినవాడయ్యాడు.

**"వారు కన్నులతో చూచి హృదయముతో గ్రహించి మనస్సు మార్చుకొని నావలన స్వస్థపరచబడకుండునట్లు ఆయన వారి కన్నులకు అంధత్వము కలుగజేసి వారి హృదయము కఠినపరచెను."** – యోహాను 12:40

ప్రజలు నమ్మకుండునట్లు ఈ యుగ సంబంధమైన దేవత వారి కన్నులకు అంధత్వము కలుగజేసింది. వారి హృదయములు గురువిందములాగా కఠినపరచబడ్డాయి. దేవుని కార్యాలు చూస్తున్నారు గాని గ్రహించడము లేదు. వింటున్నారు గాని అర్థము చేసికోవడము లేదు. అందుకే ప్రభువును తృణీకరిస్తున్నారు, విసర్జిస్తున్నారు. సిలువకు సంబంధించిన ఈ నామము ధ్యానించినప్పుడు మన వ్యక్తిగత సిలువను ఏవిధముగా మోయాలో నేర్చుకుంటాము. సేవా జీవితములో ధైర్యముతో నింపబడతాము. మనకు మాదిరిగా మనకంటే ముందు సర్వలోక పాపపరిహారార్థము సిలువ మోసిన ప్రభువున్నాడు. ప్రతి ఒక్కరికి వ్యక్తిగతముగా ఏదో సిలువ మోయాల్సి ఉంటుంది. కొన్నిసార్లు మనుష్యులు నిన్ను తృణీకరిస్తారు. మనుష్యులవలన విసర్జింపబడతావు. ఎవరికైనా సువార్త అందించడానికి ప్రయత్నిస్తే గేలి చేస్తారు అపహసిస్తారు. అప్పుడు క్రుంగిపోయి ఇంకెప్పుడు ఎవరికి సువార్త ప్రకటించనని ముడుచుకొని కూర్చోకు. ఒక్కసారి యేసుప్రభువును తేరిచూడు. ఆయన తృణీకరింపబడ్డాడు, విసర్జింపబడ్డాడు, దౌర్జన్యము నొందాడు. బాధింపబడినను నోరు తెరవలేదు. తండ్రి చిత్తమును సంపూర్ణముగా నెరవేర్చాడు. నాకంటే ముందు నా ప్రభువునే మనుష్యులు విసర్జించారు. నేనెంత. నా ప్రభువు చూపిన మాదిరినే అనుసరిస్తూ ఆయన చూపిన మార్గములో ఆగిపోక సాగిపోతానని దృఢ నిశ్చయముతో ముందుకు సాగిపోవాలి. నేను సేవ ఆరంభించినప్పుడు అందరూ నన్ను తృణీకరించారు. విసర్జించారు. నిరుత్సాహపరచారు కాని నేనేమాత్రము భయపడలేదు. వెనుకంజ వేయలేదు. నా ప్రభువునే తృణీకరించి విసర్జించిన లోకము నాకేమైనా ఘనతనిస్తుందా? నాకీ లోక ఘనతలు, మాన్యతలేమి అవసరము లేదని నన్ను సేవకు పిలిచిన నాటి నుండే సిలువ మోయడము నేర్చుకున్నాను. ప్రభువు చూపిన మాదిరిలో నన్ను నేను ఉపేక్షించుకుంటు ప్రతి దినము దేవుడు నాకిచ్చిన సిలువ మోయడము నేర్చుకున్నాను. దేవుని నామమునకే మహిమ చెల్లిస్తున్నాను.

సేవ ఆరంభించినప్పుడు మా ఇంటివారన్నారు – అందరికీ వేపకాయంత పిచ్చి ఉంటే నీకు నిమ్మకాయంత ఉంది. మంచి బ్యాంక్ ఉద్యోగముంది, మహారాణిలాగా కాలుమీద కాలు వేసికొని, నలుగురు పనివారిని పెట్టుకొని వైభవముగా సర్వసంపదలతో జీవితమును సుఖముగా అనుభవించకుండ సేవ, సేవ అంటున్నావు. రోగుల మధ్యలో, విరిగి నలిగినవారి మధ్యలో, నలిగిపోయిన స్త్రీల కన్నీరు తుడుస్తు, విడిపోయిన కుటుంబములను కడుతున్నావు. అటు ఉద్యోగము, సేవ చేస్తు, ఇటు కుటుంబ బాధ్యతలు, పిల్లల సంరక్షణ చూస్తున్న నీకు విశ్రాంతి ఎక్కడ లభిస్తుంది. నీ ఆరోగ్యము పాడవుతుంది. నీకేమి తక్కువ? హాయిగా సుఖముగా జీవించకుండ సేవ అని బయలుదేరావు, నీకు పిచ్చిపట్టిందన్నారు. పిలిచిన దేవుడు నమ్మదగినవాడు. అంతము వరకు నడిపిస్తాడనే విశ్వాసముతో పరిచర్యలో సాగిపోతున్నాను. దేవునికి స్తోత్రము కలుగును గాక!

## 368. వ్యసనాక్రాంతుడు – యెషయా 53:3

**"వ్యవనాక్రాంతుడుగాను వ్యాధి ననుభవించినవాడుగాను మనుష్యులు చూడనొల్లనివాడుగాను ఉండెను."** – యెషయా 53:3

యేసుప్రభువు శరీరధారిగా ఉన్నప్పుడు ఆయనెప్పుడూ నవ్వినట్లు నేను వాక్యములో ఎక్కడా చూడలేదు. ఆయనకు ఎప్పుడూ వ్యసనమే. యేసు కన్నీళ్లు విడిచెనని వాక్యములో ఉంది. కాపరిలేని గొఱ్ఱెలవలె యెరూషలేములో ఉన్నవారిని చూచి బహుగా ఏడ్చాడు. గెత్సేమనే తోటలో ప్రార్థించినప్పుడు బహు దుఃఖాక్రాంతుడయ్యాడు. ప్రాణము మరణమగునంతగా దుఃఖములో మునిగియుందంటాడు. బహు వేదన చెందుతాడు. ఆయన మన వ్యసనములు వహించి వ్యసనాక్రాంతుడయ్యాడు.

రక్షకుడిగా వస్తే ప్రజలు ఆయనను రక్షకుడని నమ్మడం లేదు. ఎన్నో నిందలు మోపుతు అవమానపరుస్తున్నారు. పిచ్చివాడంటున్నారు. దయ్యములను వెళ్లగొడితే దయ్యములకు అధిపతి అంటున్నారు. విశ్రాంతి దినమున రోగులను స్వస్థపరిస్తే పాపి అంటున్నారు. విశ్రాంతి దినము ఆచరించడము లేదంటున్నారు. అధికారముతో దేవుని వాక్యమందిస్తే ఏ అధికారముచేత వాక్యము అందిస్తున్నావని అంటున్నారు. బలమైన దేవుని కార్యములు పరలోక సంబంధ మర్మములు బోధిస్తే ఈయనకు ఇంత జ్ఞానమెక్కడిది? ఇతడు వడ్లవాని కుమారుడు కదా అంటున్నారు. మా ముందు పెరిగినవాడే కదా ఇంత గంభీరముగా మాట్లాడుతున్నాడు, చిన్నవాడు పెద్దమాటలు మాట్లాడుతున్నాడని నిందలు మోపుతున్నా ప్రభువు అన్నిటిని మౌనముగా భరించాడు. మన వ్యసనములు దూరము చేయడానికే ఆయన వ్యసనాక్రాంతుడిగా మారాడు.

ఒకవేళ ఈ రోజు నీవు వ్యసనము వహిస్తు వ్యసనాక్రాంతుడిగా ఉంటే క్రొత్త సంగతేమీ కాదు. నీకంటే ముందు నీ ప్రభువు నడిచిన మార్గమే. మీరు అలసట పడకయు, విసుకకయు యుండునట్లు పాపాత్ములు ఆయనకు వ్యతిరేకముగా చేసిన తిరస్కారమంతా ఓర్చుకొనిన ప్రభువును మాదిరిగా ఉంచుకొని సాగిపోవాలి. మనుష్యులు నీమీద నిందలు మోపినప్పుడు నీవు భయపడకు. దేవుని చిత్తము నెరవేర్చడానికి ఎల్లప్పుడు సంసిద్ధముగా ఉండాలి. సేవా జీవితములోనైనా, కుటుంబ జీవితములోనైనా ప్రభువుకొరకు సాక్షిగా స్థిరముగా నిలబడాలంటే ఇవన్నీ మామూలే. నిందలు అవమానములు సహించవలసి వస్తుంది. మనుష్యులు నిన్ను తృణీకరించి విసర్జిస్తారు. కొన్ని సార్లు తట్టుకోలేనంత దుఃఖము కలుగుతుంది. దుఃఖాక్రాంతుడిగా, వ్యసనాక్రాంతుడిగా మారాల్సి వస్తుంది. అయినను ఆదరణకర్త అయిన పరిశుద్ధాత్ముడు నిన్ను ఆదరించి, బలపరుస్తాడు. ఆదరణ వాక్యములు, దేవుని వాగ్దానములు నీకు జ్ఞాపకము చేసి నిన్ను ఆదరించి ఓదార్చుతాడు.

మనము భరించాల్సిన శిక్షను, వ్యసనమును ఆయన తనమీద వేసికొని వ్యసనాక్రాంతుడిగా సిలువలో వ్రేలాడాడు. మన రోగములన్ని భరించి వ్యాధిగ్రస్తుడిగా మారిపోయాడు.

**"నిశ్చయముగా అతడు మన రోగములను భరించెను. మన వ్యసనములను వహించెను. అయినను మొత్తబడినవానిగాను, దేవునివలన బాధింపబడినవానిగాను శ్రమనొందినవానిగాను మనమతనిని ఎంచితివిు. మన యతిక్రమక్రియలనుబట్టి అతడు గాయపరచబడెను మన దోషములనుబట్టి నలుగగొట్టబడెను. మన సమాధానార్థమైన శిక్ష అతనిమీద పడెను అతడు పొందిన దెబ్బలచేత మనకు స్వస్థత కలుగుచున్నది. మనమందరము గొఱ్ఱెలవలె త్రోవ తప్పిపోతివిు. మనలో ప్రతివాడును తనకిష్టమైన త్రోవకు తొలిగెను. యెహోవా మన యందరి దోషమును అతనిమీద మోపెను."** – యెషయా 53:4-6

అధిక బరువు మోసే వ్యక్తిని గమనిస్తే అతడు సంతోషముతో బరువు మోస్తాడా? వాని ముఖమంతా చెమటలు, బరువు మోస్తుంటే శరీరములో నొప్పి, అలసట, బాధంతా ముఖములో స్పష్టముగా కనపడుతుంది. తండ్రియైన దేవుడు మనందరి దోషములు యేసుప్రభువుపై మోపాడు.మన వ్యసనములన్ని ప్రభువు వహించి వ్యసనాక్రాంతుడయ్యాడు.

ఈ రోజు ఒక వేళ నీవు వ్యసనాక్రాంతుడిగా బాధ అనుభవిస్తున్నావా? నీ వ్యసనమేమిటి? తీరని రోగమా? ప్రభువు సిలువలో నీ రోగాలన్ని భరించాడు. ఆయన పొందిన దెబ్బలచేత నీకు స్వస్థత కలుగుతుంది. ఆయన నామములో ప్రార్థించి, స్వస్థత పొందు. నీ వ్యసనములు, దుఃఖములన్నీ ఆయనే వహించాడు. కనుక మోకరించి యేసు నామములో ప్రార్థించి విడుదల పొందాలి.

**సాక్ష్యము:–** వెంకటేష్ అనే సహోదరుడు తను పనిచేసే ఆఫీసులో అతనివలన పొరపాటు జరిగిపోయింది. అతడు 1200 రూపాయలకు రసీదు ఇవ్వవలసి ఉంది. కాని పని ఒత్తిడిలో తొందరపాటుతో ఈ రసీదుకు బదులుగా 12,000 రూపాయలకు చెక్‌మీద సంతకము చేసి ఇచ్చాడట. లెక్కలు సరిపోకపోవడముతో తన తప్పు గ్రహించి ఎంతో బాధపడుతున్నాడు. నేను 12,000 రూపాయలు ఎక్కడ నుండి తెచ్చి నా యజమానునికివ్వాలి. తీసుకున్న వ్యక్తి ఆ డబ్బు తిరిగి ఇవ్వకపోతే భార్యాబిడ్డలుగలవాడిని, నా జీతము ఇంటి ఖర్చులకే సరిపోదు. 12,000 రూపాయలు ఎలాగు కట్టాలనే వ్యసనముతో మందిరమునకు వచ్చి ఎంతో భారముతో ప్రార్థించాడు. దేవుని దాసురాలిగా యేసునామములో ప్రార్థించాను. అద్భుతము జరిగింది. ఎవరైతే 12,000 రూపాయల చెక్ తీసుకున్నారో అతడే ఒక గంటలో వచ్చి తిరిగి ఇచ్చేశాడు. మీరు రసీదుకు బదులు చెక్ ఇచ్చారని చెప్పి ఇచ్చాడు. ఎంత ఆశ్చర్యము. వెంకటేష్ వ్యసనమంతా ప్రభువు తీర్చేశాడు. మన వ్యసనములు తీర్చడానికే ప్రభువు ఆనాడు సిలువలో వ్యసనాక్రాంతుడయ్యాడు. విశ్వాసులు తమ సమస్యలు, రోగములు, బాధలన్నిటిని ప్రార్థన చేసి ప్రభువుకు అప్పగిస్తున్నారు. ఆయన విడుదలనిస్తున్నాడు. దేవునికి స్తోత్రము. మన వ్యసనములన్నిటికొరకు ప్రభువు సిలువలో వెల చెల్లించాడు. అందుకే ప్రభువు వ్యసనాక్రాంతుడిగా వ్యాధిగ్రస్తుడిగా మారాడు. ఆయన దైవత్వమును లోకము గుర్తించడము లేదు. ఆయన రక్షకుడంటే లోకము నమ్మడము లేదు. దేవుని కుమారుడని గ్రహించడము లేదు. మనందరి పాపములు, అతిక్రమములు, దోషములు ఆయనపై మోపబడ్డాయి. అందుకే ఆయన వ్యసనాక్రాంతుడిగా మారిపోయాడు. ఆయన శరీరధారిగా రక్తమాంసములతో సంపూర్ణ మానవునిగా ఉన్నాడు. సిలువలో ప్రాణము పెట్టడము ఘోరమైన శ్రమ. అది అనుభవించడము ఎంతో వ్యసనము సంకటమే. అందుకే తండ్రీ, నీ చిత్తమైతే ఈ గిన్నె నాయొద్దనుండి తొలగించు. అయినను నా ఇష్టము కాదు నీ చిత్తమే సిద్ధించును గాక అని గెత్సేమనే తోటలో బహు దుఃఖాక్రాంతుడై ప్రార్థించాడు. మన వ్యసనములు ఆయన వహించి ఆయన నామములో ప్రార్థించే నీకు విడుదలనిచ్చి సంతోషభరితులుగా చేస్తున్నాడు. దేవుని నామమునకే మహిమ కలుగును గాక!

## 369. వ్యాధి ననుభవించినవాడు – యెషయా 53:3

**"వ్యసనాక్రాంతుడుగాను వ్యాధి ననుభవించినవాడుగాను మనుష్యులు చూడనొల్లనివాడుగాను ఉండెను."** – యెషయా 53:3

ఆయన మనకొరకు వ్యాధిననుభవించినవాడుగా మారిపోయాడు. యేసుప్రభువు (33½) ముప్పైమూడున్నర సంవత్సరముల యౌవన ప్రాయములో మంచి ఆరోగ్యము, బలము ఉన్నప్పుడు సిలువకు అప్పగింపబడ్డాడు. మన రోగములు, మన వ్యసనములు, మన పాపములు, మన దుఃఖములు భరించి ఆరోగ్యవంతుడు, బలవంతుడైన ప్రభువు వ్యాధిగ్రస్తుడయ్యాడు. మన అతిక్రమక్రియలకొరకు నలుగగొట్ట బడ్డాడు. మనందరి దోషము అతనిపై మోపబడింది. ఏ పాపమెరుగని ప్రభువు మన నిమిత్తము పాపముగా మారిపోయాడు. సుందరుడు బలవంతుడైన ప్రభువు బలహీనుడిగా అందవిహీనుడిగా మారిపోయాడు. ఆరోగ్యముతో ఉన్న ప్రభువు వ్యాధిగ్రస్తుడయ్యాడు. సిలువలో శాపగ్రస్తుడిగా వ్రేలాడాడు. ఆయన సిలువ మరణముద్వారా మనకు విడుదల, స్వస్థత, రక్షణ ప్రసాదించాడు.

**"నిశ్చయముగా అతడు మన రోగములను భరించెను. మన వ్యసనములను వహించెను. అయినను మొత్తబడినవానిగాను దేవునివలన బాధింపబడినవానిగాను శ్రమనొందినవానిగాను మనమతనిని ఎంచితిమి. మన యతిక్రమక్రియలనుబట్టి అతడు గాయపరచబడెను. మన దోషములనుబట్టి నలుగగొట్టబడెను. మన సమాధానార్థమైన శిక్ష అతనిమీద పడెను. అతడు పొందిన దెబ్బలచేత మనకు స్వస్థత కలుగుచున్నది. మనమందరము గొఱ్ఱెలవలె త్రోవ తప్పిపోతిమి. మనలో ప్రతివాడును తనకిష్టమైన త్రోవకు తొలిగెను. యెహోవా మన యందరి దోషమును అతనిమీద మోపెను. అతడు దౌర్జన్యము నొందెను బాధింపబడినను అతడు నోరు తెరవలేదు వధకు తేబడు గొఱ్ఱెపిల్లయు బొచ్చు కత్తిరించువానియెదుట గొఱ్ఱెయు మౌనముగా నుండునట్లు అతడు నోరు తెరువలేదు."** – యెషయా 53:4-7

యెషయా 53వ అధ్యాయములో ఉన్న ఈ నామములు ధ్యానిస్తున్నప్పుడు మన హృదయము ప్రభువుపట్ల కృతజ్ఞతతో నిండిపోతుంది. ఆయన త్యాగము, బలియాగము చేయకుంటే, సిలువలో మరణించకుంటే ఈనాడు అనుభవించే రక్షణానందము మనకు ఉండేది కాదు. మన అందరి దోషములకై, యతిక్రమక్రియలకై, పాపములకై ప్రభువు సిలువలో గాయపరచబడ్డాడు. తలపై ముండ్ల కిరీటము పెట్టారు. ఆ ముండ్లు తలలో గ్రుచ్చుకొని రక్తము ఊటలుగా కారుతుంది. చాటవారుతో వీపు దున్నబడింది. ముఖముమీద ఉమ్మివేయబడింది. చెంపలు గడ్డము పట్టుకొని లాగుతున్నారు. హేళన మాటలతో అపహసిస్తున్నారు. ఆయన మన దోషములన్నిటికొరకై అపరాధపరిహారార్థబలిగా మారిపోయాడు. మనలను నిర్దోషులుగా పవిత్రులుగా చేయుటకు మన దోషములన్నిటిని ఆయనమీద వేసికున్నాడు. ఆయన వ్యాధిననుభవించినవాడుగా అయిపోయాడు.

వాక్యము ధ్యానిస్తున్న నీవు ఈ రోజు ఏదైనా వ్యాధిని అనుభవిస్తున్నావా? భయపడకు. ఆయన పొందిన దెబ్బలచేత స్వస్థత కలుగుతుంది. ఆయన నామములో స్వస్థత ఉంది. ప్రభువు 39 కొరడా దెబ్బలు తిన్నాడు. వైద్యులు, శాస్త్రజ్ఞులు ప్రపంచంలో 39 ప్రధానరోగములున్నాయి అని అంటున్నారు. 39 ఘోరమైన వ్యాధులకొరకు ప్రభువు సిలువలో 39 కొరడా దెబ్బలు తిన్నాడు. కొరడా చివర కొంకి లాంటిది ఉంటుంది. దానితో కొట్టినప్పుడు మాంసమును ఎముక మీదినుండి లాగివేస్తుంది. రక్తము ఊటలుగా కారుతుంది. ఆయన పొందిన దెబ్బలచేత మనకు స్వస్థత కలుగుతుంది. ఆయన గాయములచేత విడుదల కలుగుతుంది. అందుకే మేము రోగముతో బాధపడినప్పుడు ప్రార్థనద్వారా యేసునామములో స్వస్థపరచబడ్డామని అనేకులు సాక్ష్యమిస్తారు. యేసుప్రభువు నామమునకు మహిమ ఘనత చెందుతుంది. ఆయన నామమందు విశ్వాసముంచడము ద్వారా అపవాది క్రియలు లయమవుతాయి. అనారోగ్యతకు బదులు ఆరోగ్యము, శాపమునకు బదులు ఆశీర్వాదము పొందుతున్నాము.

**"అందువలన – ఆయనే మన బలహీనతలను వహించుకొని మన రోగములను భరించెనని ప్రవక్తయైన యెషయాద్వార చెప్పబడినది నెరవేరెను."** – మత్తయి 8:17

యేసుక్రీస్తు ప్రభువు శరీరధారిగా ఉన్నప్పుడు తన ఒక్క మాటచేత దయ్యములు వదిలిపోయాయి. ఒక్క మాటచేత తుపాను అణిగిపోయింది. మాటచేత కుష్ఠురోగి శుద్ధుడయ్యాడు. కుంటివారు నడచారు. మూగవారు మాట్లాడారు. గ్రుడ్డివారి కన్నులు తెరువబడ్డాయి. ఒక్క మాటచేత చచ్చిన

లాజరు బ్రదికాడు. ఆయన మనకొరకు వ్యాధిగ్రస్తుడై సిలువలో గాయపరచబడి సమస్త వ్యాధులకొరకు తన విలువైన రక్తమును చిందించాడు. ఆయన పొందిన దెబ్బలచేత స్వస్థత కలుగుతుంది. నీకేదైనా రోగము సోకినప్పుడు వైద్యుల నాశ్రయించక ముందు దేవుని నాశ్రయించు. యేసుక్రీస్తు పరమ వైద్యుడు. ఆయన రక్తము సర్వరోగ నివారిణి. నీవు నమ్మినయెడల దేవుని మహిమను చూస్తావు. పరుగెత్తి వైద్యుల దగ్గరకు వెళ్లితే కొన్నిసార్లు వారు పొరపాటు జరిగిస్తారు. రోగ నిర్ధారణ తప్పుగా జరిగిపోతుంది. wrong diagnosis, wrong treatment, wrong medicines ఇస్తారు. రోగ మొకటయితే మందు ఒకటిస్తారు. ఆ మందు వికటించి ఇంకొక సమస్య ప్రారంభమవుతుంది. కుడికన్నులో సమస్య ఉందని వైద్యుని దగ్గరకు వెళితే పొరపాటుగా ఎడమకంటికి ఆపరేషన్ చేశారట. ఫలితముగా రెండు కళ్లు పోగొట్టుకొని గ్రుడ్డివాడయ్యాడు. పనికిరాని వైద్యులు అని పరిశుద్ధ గ్రంథములో ఉంది. రోగము కలిగినపుడు దేవుని సన్నిధిలో కనిపెట్టి ప్రార్థించి వైద్యుల దగ్గరకు వెళ్లాలి. అప్పుడు వారిద్వారా ఏ పొరపాటు జరగకుండా నీకు సరియైన ట్రీట్‌మెంట్ లభిస్తుంది. దేవుని ఆశ్రయించకుండ హడావుడిగా వైద్యులను ఆశ్రయించకు.

పరమ వైద్యుడు యేసుప్రభువు. నీ వ్యాధులన్నిటిని సిలువలో భరించాడు. ఆయన మనకొరకు వ్యాధిననుభవించినవానిగా అయ్యాడు. ఆయన నీ వ్యాధులకొరకు సిలువలో వెల చెల్లించాడు. ఆయన గొప్ప శక్తిగల నామములో ప్రార్థించి, స్వస్థత పొందాలి. నీకు స్వస్థత విడుదల నివ్వడానికే ఆయన బాధలన్నిటిని మౌనముగా భరించాడు. ఆయన బాధింపబడినను తన నోరు తెరువలేదు. ఎంత ఆశ్చర్యమనిపిస్తుంది. మనకు చిన్న బాధకలిగితే మూల్గుతాము. కాని ప్రభువు ఘోరశ్రమలు అనుభవిస్తూ దేహమంతా గాయములు, రక్తము ఊటలుగా ప్రవహిస్తున్నా, అపహాస్యము చేస్తూ హేళన మాటలు పలుకుతు నీవు రక్షకుడివా? అయితే నిన్ను నీవు రక్షించుకోమని హేళన చేస్తున్నా బదులుగా ప్రభువు ఒక్కమాట పలుకలేదు. ఆయన నోరు తెరవలేదు. ఎందుకంటే రక్షణ సంకల్పము నెరవేరాలి. తండ్రి చిత్తము జరగాలి. సర్వమానవాళికి రక్షణ కలుగటానికే ప్రభువు బాధింపబడినను నోరు తెరువలేదు.

ప్రభువు జీవితము గమనిస్తే నాకు చాలా ఆశ్చర్యమనిపిస్తుంది. యేసు ప్రభువు జీవితముద్వారా అనేక సత్యములు నేర్చుకున్నాను. వాటిని అనుసరించాలని ఎంతో ఆశిస్తున్నాను. నేనేమీ పరిపూర్ణురాలను కాను. నాకు బలహీనతలున్నాయి. నా బలహీనతలలో ప్రభువు తన శక్తిని అనుగ్రహిస్తాడు. కృపనిస్తాడు. మనము వ్యక్తిగతముగా ఏదైన బాధ అనుభవించినపుడు, ఎవరైనా మనలను నిందించినపుడు నోరు తెరచి అవతలివారిని ఎడాపెడా తిట్టేయాలనిపిస్తుంది. కాని నీవు నోరు తెరిచావంటే దేవుని కార్యము జరుగదు. ఆయన బాధింపబడినను నోరు తెరువలేదు. ఈ విషయము నన్నెంతో ఆకర్షించింది. మనము బాధింపబడినప్పుడు మౌనముగా సహించడము నేర్చుకోవాలి. అప్పుడు నీ జీవితములో దేవుని కార్యములు చూడగలవు.

ఆయన బాధింపబడినను నోరు తెరువలేదు. ఆయన నోట ఏ కపటము లేదు. వధకు తేబడు గొఱ్ఱెపిల్లయు, బొచ్చు కత్తిరించువానియెదుట గొఱ్ఱెయు మౌనముగా నుండునట్లు, ఆయన అన్యాయపు తీర్పును మౌనముగా సహించాడు. ఎందుకంటే మనకు నిత్యజీవమివ్వడానికి, రక్షణానందము అనుగ్రహించడానికి, ఆరోగ్యమివ్వడానికి, శాపమునకు బదులు ఆశీర్వాదమనుగ్రహించడానికి, పాపమునకు బదులుగా పరిశుద్ధ జీవితమివ్వడానికి తన సొగసును సురూపమును కోల్పోయాడు. ఆయన తన అందమును, ఆరోగ్యమును, సుఖమును కోల్పోయాడు.

అందుకే ప్రవక్త ఆయన ఎండిన భూమిలో మొలిచిన లేతమొక్క. అతనికి సురూపమైనను సొగసైనను లేదంటున్నాడు. గోధుమగింజ భూమిలో పడి చనిపోతేనే ఫలిస్తుంది. అది తన రూపమును కోల్పోయి భూమిపైన పచ్చని పైరును, ఫలమును ఇస్తుంది. అలాగే ప్రభువు సిలువలో మరణించి సర్వమానవాళికి రక్షణ ప్రసాదించాడు. హల్లెలూయ.

ఒక రైతు కుటుంబములో తల్లి తండ్రి చాలా కష్టజీవులు. భూమి దున్ని పంట పండించి, ఆ పంటను సొమ్ముచేసి తమ బిడ్డలను చదివిస్తున్నారు. వారి కుమారుని పట్టణములోని ఒక ఇంజనీరింగ్ కాలేజీలో చదివిస్తున్నారు. తండ్రి రక్తము చెమటగా మార్చి డబ్బు పంపుతున్నాడు. కుమారుడు నగరములో హాయిగా చదువుకుంటు మంచి ఖరీదైన బట్టలు, షూస్ ధరించి హుందాగా ఉంటున్నాడు. తండ్రేమో ఎండనక, వాననక పగలు-రాత్రి తేడా లేకుండ శ్రమించి తన రూపము కోల్పోయాడు. ఒకసారి కుమారుని చూడాలనిపించి నగరమునకు వెళ్లాడు. ఆ కుమారుని కాలేజీ గేట్ దగ్గర నిలబడితే వాళ్ల ఊరినుండి వచ్చిన కుమారుని స్నేహితుడు గుర్తించి అతన్ని తన స్నేహితుని దగ్గరకు తీసుకువెళ్లాడు. ఒరేయ్, మీ నాన్న వచ్చాడని చెప్పగానే - మోటుగా మురికి మురికిగా వృద్ధాప్యములో ఉన్న తండ్రిని తన స్నేహితులకు పరిచయము చేయడానికి సిగ్గనిపించి, మా ఇంట్లో పనివాడని స్నేహితులకు పరిచయము చేశాడట. ఆ మాట ముసలి తండ్రి చెవిలో పడగానే తట్టుకోలేని దుఃఖముతో నోట మాటరాక వెనుదిరిగి వెళ్లాడు. ఎవరికోసము దివారాత్రులు శ్రమించి భూమి దున్ని పంట పండించాడో, రక్తము చెమటగా మార్చి శ్రమించాడో, కుమారుడు ఉన్నత విద్యాభ్యాసము చేసి ఉన్నతమైన హోదాలో ఉండాలని ప్రయాసపడ్డాడో, ఆ కుమారునికి ఈనాడు తన తండ్రిని తండ్రిగా పరిచయము చేయడానికి సిగ్గు అనిపించింది. ఎంత ఘోరము! అందరి ముందు తండ్రిని తృణీకరించాడు. తండ్రి తనతో తెచ్చిన డబ్బులు పదివేల రూపాయలు ఇవ్వబోతే తీసుకోవడానికి వెనుకాడాడు. ఎందుకంటే స్నేహితులకు పనివాడని పరిచయము చేశాడుకదా. తండ్రి భారభరిత హృదయముతో దుఃఖముతో డబ్బు తీసికొని వెనుకకు వెళ్లిపోయాడు.

యేసుప్రభువును రక్షకుడిగా స్వీకరించడానికి వెనుకాడుతున్నావా? ఆయన నీకొరకు తృణీకరింపబడినవాడుగా, మనుష్యులవలన విసర్జింపబడినవాడుగా, వ్యసనాక్రాంతుడిగా, వ్యాధిననుభవించినవాడుగా మారిపోయాడు. నీకు సంతోషము, సమాధానము, ఆరోగ్యము, ఆశీర్వాదమివ్వడానికే ఆయన సిలువలో పటుబాధలు పొందాడు. రక్షణానందమివ్వడానికే తాను బాధింపబడినను నోరు తెరువలేదు. ఆయన సర్వలోక పాపపరిహారార్థ బలిగా అప్పగింపబడ్డాడు. ఆయన నామములోనే రక్షణ. ప్రభువును రక్షకుడిగా స్వీకరించకుంటే ఇదే మంచి సమయం యేసుప్రభువును నీ స్వరక్షకుడిగా స్వీకరించు. ఆయన లోబడనొల్లని పిల్లల తట్టు దినమెల్లా చేతులు చాపుతున్నాడు.

మీరు నన్ను జ్ఞాపకము చేసికొనుటకు దీనిని చేయుడని ప్రభువు సెలవిస్తున్నాడు. ప్రభువు బల్లలో పాలు పొందినప్పుడు విరువబడిన రొట్టె ప్రభువు శరీరమునకు సాదృశ్యముగా ఉంది. సిలువలో మనకొరకు విరువబడిన ఆయన శరీరమును జ్ఞాపకము చేసికోవాలి. ద్రాక్షారసము ఆయన మనకొరకు చిందించిన రక్తమునకు సాదృశ్యముగా ఉంది. రొట్టెను, ద్రాక్షారసమును పుచ్చుకొనినప్పుడెల్ల ప్రభువు సిలువ మరణము జ్ఞాపకము చేసికోవాలి. ప్రభువు పడిన పటు బాధలు జ్ఞాపకం చేసికోకుండ, కృతజ్ఞత లేకుండా జీవిస్తే అది ఘోరమైన స్థితి. పశ్చాత్తాపముతో విరిగి నలిగిన హృదయముతో ఆయనను జ్ఞాపకము చేసికొని రొట్టె విరుచుటలో పాలు పొందాలి. ఆయన మన నిమిత్తము సిలువలో వ్యాధిగ్రస్తుడయ్యాడని జ్ఞాపకము చేసికోవాలి.

# దేవుని వెయ్యి వాగ్దానములు

## 168. అడుగుడి మీకియ్యబడును." - మత్తయి 7:7

**"అడుగుడి మీకియ్యబడును, వెదకుడి మీకు దొరకును, తట్టుడి మీకు తీయబడును; అడుగు ప్రతివాడును పొందును, వెదకువానికి దొరకును, తట్టువానికి తీయబడును."** - మత్తయి 7:7,8

ఈ వాక్యభాగమునుండి మూడు వాగ్దానములు ధ్యానించనైయున్నాము. అడుగుడి మీకియ్యబడును; వెదకుడి మీకు దొరకును, తట్టుడి మీకు తీయబడును.

అడుగుడి మీకియ్యబడునని దేవుడు వాగ్దానమిచ్చాడు. అడగడమంటే ప్రార్థన చేయడమే. ప్రార్థనలో మన మనవులు విజ్ఞాపనలు దేవునికి తెలియజేయడమే. నీకు ఏదైనా స్కూల్‌లో కాలేజీలో అడ్మిషన్ కావాలన్నా ఏదైనా ఉద్యోగము కావాలన్నా, ఏదైనా బ్యాంకునుండి (ఋణం) లోన్ కావాలన్నా మొట్ట మొదట ఒక అప్లికేషన్ పెడతావు. ఆ అప్లికేషన్ వారు అంగీకరించి నీవు కోరినది నీకు శాంక్షన్ చేయవచ్చు లేదా నీ అప్లికేషన్ నిరాకరించి త్రోసిపుచ్చవచ్చు. కానీ నీవసలు అప్లికేషన్ పెట్టకుంటే ఎలా పొందుతావు? అందుకే అడుగుడి మీకియ్యబడునని దేవుడు వాగ్దానము చేశాడు. మీరు నా నామములో అడిగినది పొందుతారు. మీరింతవరకు నా పేరట ఏమియు అడుగలేదు, ఇప్పుడు మీ సంతోషము సంపూర్ణ మగునట్లు మీరు అడుగుడి అని అంటున్నాడు. అడుగు ప్రతివాడు పొందుతాడు; వెదకు వారికి దొరకుతుంది; తట్టువారికి తీయబడుతుంది. అందుకే ఎల్లప్పుడు ప్రార్థనలో మన మనవులు దేవునికి తెలియజేయాలి అని యేసుప్రభువు ఉపమానరీతిగా బోధిస్తునాడు.

**"మీలో ఏ మనుష్యుడైనను తన కుమారుడు తన్ను రొట్టెను అడిగినయెడల వానికి రాతినిచ్చునా? చేపను అడిగినయెడల పాము నిచ్చునా? మీరు చెడ్డవారై యుండియు మీ పిల్లలకు మంచి యీవుల నియ్యనెరిగి యుండగా పరలోకమందున్న మీ తండ్రి తన్ను అడుగువారికి అంతకంటె ఎంతో నిశ్చయముగా మంచి యీవుల నిచ్చును."**
- మత్తయి 7:9-11

అందుకే మనకు ఏమి కావాలో దేవుని అడిగి పొందాలి. దేవుడు తనను అడుగువారికి ఎంతో నిశ్చయముగా, మంచి యీవుల నిస్తాడు. వాక్యము ధ్యానిస్తున్న మీ మనవి ఏమైనా అడగండి. మీకు స్వస్థత కావాలా అడగండి; సమాధానము కావాలా అడగండి. పేదరికములో నున్నావా, దీవించమని అడుగు. నీ అవసరత ఏదైనా పొందేవరకు విసుకక నిత్యము ప్రార్థించాలి. ఏదో ఒకరోజు అడిగి ఊరకుండటము కాదు గాని మీరు పొందేవరకు అడగాలి. ఒకవేళ నీ ప్రార్థనలకు జవాబు ఆలస్యమయినా అలసిపోకుండ అడుగుతూనే ఉండాలి. దేవుని ఆలస్యము నీకు ఆశీర్వాదములనే తీసుకొని వస్తుంది. కొన్నిసార్లు నిన్ను మెరుగుపెట్టిన అంబుగా చేయడానికి ఆయన ఆలస్యము చేస్తాడు. నిశ్చయముగా జవాబు వస్తుంది. పట్టదలతో ప్రార్థించు. దేవునితో ఎక్కువ సమయము గడపాలి. దేవుని నామములతో స్తుతించి వాగ్దానములు ఎత్తిపట్టి ప్రార్థించాలి.

యేసుప్రభువు తాను ప్రేమించిన లాజరు చనిపోయినప్పుడు వెంటనే రాలేదు. చనిపోయిన నాలుగురోజుల తరువాత వచ్చాడు. లాజరు రోగిగా ఉన్నప్పుడే ప్రభువు వచ్చి స్వస్థపరచియుంటే బాగుండేదని మనము అనుకుంటాము. కాని ప్రభువుకు తెలుసు ఎప్పుడు రావాలోయని. కొన్నిసార్లు దేవుడు ఆలస్యము చేస్తాడు ఎందుకంటే దేవుని నామము ఎక్కువగా మహిమ పొందడానికేనని తెలిసికోవాలి. నీవు అసాధ్యమని అనుకున్నవి సాధ్యపరచి భూప్రజలందరియెదుట నిన్ను గొప్ప చేస్తాడు. దేవునికి స్తోత్రము. నీవు దేవుడు చేసిన మహిమకార్యములను ఎల్లప్పుడు జ్ఞాపకము చేసికుంటూ దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లిస్తావు. దేవా, నాకు అసాధ్యము అసంభవము అనుకున్న వాటినన్నిటిని నీవు సాధ్యపరచి గొప్ప విడుదల నిచ్చినందుకు నీకు స్తోత్రములంటూ దేవుని స్తుతిస్తూ, యెడతెగక దేవుని నామమును మహిమపరుస్తావు. అందుకే ఆలస్యమయినా అడుగుతూనే ఉండాలి. దేవుడు మిమ్మును కరుణించేంత వరకు అడుగుతూనే ఉండాలి. ఒక తల్లి తన కుమారుని మారుమనస్సు కొరకు 25 సంవత్సరములు ప్రార్థన చేసిందట. త్రాగుబోతు, చెడు సాంగత్యములోనున్న తన కుమారుని రక్షించమని ఆ తల్లి 25 సం॥లు కన్నీటి ప్రార్థన చేస్తూనే ఉన్నది. ఆ కుమారుడు మారుమనస్సు పొంది రక్షింపబడి గొప్ప భక్తుడిగా మారిపోయాడు. ఆ భక్తుడే హడ్సన్ టేలర్. చైనా దేశమునకు మిషనరీగా వెళ్లి అక్కడున్న నరమాంస భక్షకులకుకూడ ధైర్యముగా సువార్తను ప్రకటించాడు.

మేరి స్లెస్సర్ అనే యౌవన కుమార్తె రక్షణకొరకు తల్లి కన్నీటితో ప్రార్థించిందట. భయంకరమైన పాపములోనున్న తన కూతురు రక్షింప బడాలని ఆ తల్లి చేసిన కన్నీటి ప్రార్థన ఫలించి ఆమె కూతురు భక్తురాలిగ మారిపోయింది. ఆమె ఆఫ్రికా ఖండమునకు మిషనరీగా వెళ్లి సువార్త ప్రకటించింది దేవునికొరకు ఒక ధీరవనితగా మారిపోయింది.

దేవుని సన్నిధిలో నీవు చేసే ప్రార్థనలు, కార్చిన కన్నీరు ఏనాడు వ్యర్థము కాదు. నిష్ఫలముగా ఉండదు. నీ ప్రార్థన ధూపమువలే ఆయన సన్నిధిలో జ్ఞాపకార్థముగా నిలబడుతుంది. నన్నడిగితే ప్రార్థన మన ఊపిరిగా మారిపోవాలి. పనిచేస్తూ ప్రార్థించాలి. ఒక వ్యక్తిని చూడగానే ఆ వ్యక్తి కొరకు ప్రార్థన చేయాలి. నేను ఆలాగే చేస్తాను. దేవా! వీళ్లను నీ ఆత్మతో నింపు, గొప్ప భక్తులుగా చేయండి, నీ కృపావరములతో నింపండి. రాబోయే కాలములో సంఘమును నిలబెట్టే స్తంభములుగా చేయుమని నా గుండెనుండి ధూపమువలె మీకొరకు ప్రార్థన చేస్తూనే ఉంటాను. దేవుడు నేను ఆశించినదానిని నెరవేర్చుతాడు. నేను అడుగుతున్నాను కాబట్టి పొందుతాను. నేను అడుగకుంటే ఏలాగు పొందుతాను? రేయి మొదటిజామున లేచి నీ పిల్లలకొరకు ప్రార్థన చేస్తే నిశ్చయముగా నీ పిల్లలు ఆశీర్వదింపబడతారు. మారుమనస్సు పొంది రక్షింపబడి గొప్పభక్తులుగా మారిపోతారు. నీతి ప్రవర్తన కలిగియుంటారు. దేవుని సేవ చేయాలని నీవు ఆశిస్తే తప్పకుండ రాబోయే కాలములో గొప్ప దేవుని సేవ చేస్తారు. నీవు దేవునియెదుట చేసే ప్రతి ప్రార్థనను ఆయన అంగీకరిస్తాడు. నీ ప్రార్థనలన్నియు సఫలపరచి పరిశుద్ధస్థలములోనుండి నీకు సహాయము చేస్తాడు. దేవునికి స్తోత్రము. యు.పి.ఎఫ్. మందిరము ఉదయము 5 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు తెరచియుంటుంది. నీవు మందిరమునకు వచ్చి దేవుని సన్నిధిలో మోకరించి దేవునియొద్దనుండి నీకేమి కావాలో అడిగి పొందాలి మనము చెడ్డవారమైయుండి మన పిల్లలకు మంచి యీవుల నియ్యనెరిగియుంటే మన పరలోకపు తండ్రి తనను అడుగువారికి ఎంతో నిశ్చయముగా శ్రేష్టమైన యీవులనిస్తాడు.

సంఘములో 24 గంటలు జూమ్ ద్వారా ప్రార్థన జరుగుతుంది. ప్రార్థనలో పాలు పొందినవారందరు ఆత్మతో నింపబడాలని ప్రార్థన చేస్తున్నాను. దేవుడు సర్వజనులమీద తన ఆత్మను కుమ్మరిస్తానని వాగ్దానము చేశాడు. దేవుడు తనను అడుగువారికి కొలత లేకుండ పరిశుద్ధాత్మను అనుగ్రహిస్తాడు. ప్రతి సంవత్సరములో నలువది దినములు ఏకదాటిగా సిలువధ్యానములు జరిగిస్తున్నాము. ఆయన సిలువశ్రమలను ధ్యానిస్తుంటే ఆయన మనకు బహుమానము ఇవ్వకుండ ఉంటాడా? ప్రతివాని జీతము ఆయనయొద్ద ఉంది. కీర్తనలు 2:8 వాగ్దానము ఎత్తిపట్టి ప్రార్థన చేస్తున్నాను. తప్పకుండ ఆ వాగ్దానము నాపట్ల నెరవేరుతుందని నా విశ్వాసము. జనములను స్వాస్థ్యముగా భూమిని దిగంతములవరకు సొత్తుగా తప్పకుండ పొందుతాను. దేవునికి స్తోత్రము.

## 169. "వెదకుడి మీకు దొరకును." – మత్తయి 7:7

వెదకుడి మీకు దొరకును అని దేవుని వాగ్దానము పొందేవరకు దొరికేయంతవరకు వెదకాలి. లూకా సువార్త 15వ అధ్యాయములో ఉపమానరీతిగా ప్రభువు బోధించాడు.

**"అందుకాయన వారితో ఈ ఉపమానము చెప్పెను. – మీలో ఏ మనుష్యునికైనను నూరు గొఱ్ఱెలు కలిగియుండగా వాటిలో ఒకటి తప్పిపోయినయెడల అతడు తొంబది తొమ్మిదింటిని అడవిలో విడిచిపెట్టి, తప్పిపోయినది దొరకువరకు దానిని వెదక వెళ్లడా? అది దొరకినప్పుడు సంతోషముతో దానిని తన భుజములమీద వేసికొని యింటికి వచ్చి తన స్నేహితులను పొరుగువారిని పిలిచి – మీరు నాతోకూడ సంతోషించుడి; తప్పిపోయిన నా గొఱ్ఱె దొరకినదని వారితో చెప్పునుగదా. అటువలె మారుమనస్సు అక్కరలేని తొంబదితొమ్మిది మంది నీతిమంతుల విషయమై కలుగు సంతోషముకంటె మారుమనస్సుపొందు ఒక్క పాపి విషయమై పరలోకమందు ఎక్కువ సంతోషము కలుగును.**

**ఏ స్త్రీకైనను పది వెండి నాణెములుండగా వాటిలో ఒక నాణెము పోగొట్టుకొంటె ఆమె దీపము వెలిగించి యిల్లు ఊడ్చి అది దొరకువరకు జాగ్రత్తగా వెదకదా? అది దొరకినప్పుడు తన చెలికత్తెలను పొరుగువారిని పిలిచి – నాతోకూడ సంతోషించుడి, నేను పోగొట్టుకొనిన నాణెము దొరకినదని వారితో చెప్పును గదా, అటువలె మారుమనస్సు పొందు ఒక పాపి విషయమై దేవుని దూతలయెదుట సంతోషము కలుగునని మీతో చెప్పుచున్నాననెను."** – లూకా 15:4-10

యేసుప్రభువు నోటినుండి వచ్చిన మాట నిష్ఫలము కాదు. వెదకుడి మీకు దొరకును. నీవు ఏమేమి పోగొట్టుకున్నావో శ్రద్ధగా వెదకితే, దొరకుతుంది. ఒక ముసలమ్మ తన కళ్లజోడు కనబడటము లేదని ఆరు నెలలుగా వెదకుతుండట. ఆరు నెలల తరువాత పాస్టర్‌గారు ఆమెను దర్శించి ఆమెకొరకు ప్రార్థించడానికి వారి యింటికి వెళ్లాడట. ఆమెతో – అమ్మా, నీ బైబిల్ తీసికొని రా, కొద్దిసేపు వాక్యము ధ్యానించి ప్రార్థన చేస్తాను అనగానే ఆ తల్లి వెళ్లి ఆరు నెలలుగా అటకమీద పెట్టిన బైబిల్‌ను దుమ్ము దులిపి తీసికొని వచ్చిందట. ఆమె బైబిల్ తెరవగానే ఆరునెలలుగా ఆమె వెదకుతున్న కళ్లజోడు బైబిల్‌లో కనిపించిందట. అంటే ఆమెకు అనుదినము దేవుని వాక్యము ధ్యానించే అలవాటు ఉంటే పోగొట్టుకున్న రోజే ఆమె కళ్లజోడు ఆమెకు కనబడియుండేది. పాస్టర్‌గారు రావడము వలన ఆమె కళ్లజోడు దొరికింది.

వెదకుడి మీకు దొరకును అని దేవుని వాగ్దానము. మనము దేవుని వెదకాలి. ఆయన సన్నిధి వెదకాలి. ఆయనను జాగ్రత్తగా వెదకువారు ఆయనను కనుగొంటారు. ఆయన సన్నిధిలో సంపూర్ణసంతోషము ఆయన కుడిచేతిలో నిత్యమైన సుఖమున్నది. దేవునికి స్తోత్రము. నా కుమార్తె చనిపోయినప్పుడు నాకు ఎక్కడ ఓదార్పు లభిస్తుందని విరిగి నలిగిన నాకు ఆదరణ ఎక్కడ దొరకుతుందని శ్రద్ధగా వెదకాను. చనిపోవాలని అనుకున్న నన్ను బ్రదికించింది దేవుని జీవపు మాటలు. నన్ను ఆదరించి ఓదార్చింది దేవుని వాక్యమే. నాయెదుట మరణము జీవము రెండు మార్గములున్నాయి కాని నేను జీవమార్గమునే యెంచుకున్నాను. దాదాపు ఏడు సంవత్సరములు ఉదయము నాలుగు గంటలకే లేచి దేవుని సన్నిధి వెదికేదానను. ఆయన నాకు దొరికాడు. ఇంకా వెదకుతూనేయున్నాను. దాచబడిన ధనమును వెదికినట్లు సర్వసంపదలగని అయిన దేవుని వెదకుతూనేయున్నాను. పొందుతునే యున్నాను. వెయ్యి నామములు, వెయ్యి వాగ్దానములు, వెయ్యి ఆదేశములు ఆయన ఊటలలోనుండి జీవపుమాటలు పొందుతూనే యున్నాను. కొన్నిసార్లు గొప్ప గొప్ప దైవజనులు నన్నడుగుతారు. జాయ్, నీకు ఇవన్ని ఎలా దొరుకుతున్నాయని? నేను వెదకుతున్నాను నాకు దొరకుతున్నాయి. మీరుకూడ శ్రద్ధగా వెదికితే మీకు కూడ దొరకుతాయని చెప్పాను. వెండినాణెము పోగొట్టుకున్న స్త్రీ అది దొరికే వరకు వెదికింది. ఏదైనా పోగొట్టుకుంటే అది దొరికేవరకు వెదకుతూనే ఉంటాము. అశాశ్వతమైన వాటికొరకు ఎంతో శ్రద్ధగా వెదకుతాము కాని శాశ్వతమైన దేవుని వెదకడానికి ఆయన ప్రేమను వెదకడానికి ఆయన సన్నిధి వెదకడానికి వెనుకంజ వేస్తాము. దేవుని వెదికితే దేవుని కనుగొంటావు. నీ ప్రాణము తెప్పరిల్లుతుంది. ఐశ్వర్య ఘనతలు స్థిరమైన కలిమిని పొందుతారు.

**"నన్ను జాగ్రత్తగా వెదకువారు నన్ను కనుగొందురు. ఐశ్వర్య ఘనతలును స్థిరమైన కలిమియు నీతియు నాయొద్దనున్నవి."** – సామెతలు 8:17,18

**"యెహోవాను వెదకువారు హృదయమందు సంతోషించుదురుగాక. యెహోవాను వెదకుడి ఆయన బలమును వెదకుడి ఆయన సన్నిధిని నిత్యము వెదకుడి."** – కీర్తనలు 105:3,4

**"ఘనతా ప్రభావములు ఆయన సన్నిధిని ఉన్నవి, బలసౌందర్యములు ఆయన పరిశుద్ధస్థలములో ఉన్నవి."** – కీర్తనలు 96:6

దేవుని వెదికేవారికి ఘనత లభిస్తుంది. అంచెలంచెలుగా దేవుడు నిన్ను ఆశీర్వదిస్తాడు. కొన్నిసార్లు నీవు దేవుని వెదకవుగాని దేవుడే నిన్ను వెదకుతూ నీయొద్దకు వస్తాడు. వంద గొఱ్ఱెలలో ఒక గొఱ్ఱె తప్పిపోతే తొంబది తొమ్మిదింటిని ప్రక్కన పెట్టి తప్పిపోయిన గొఱ్ఱెను వెదకి పట్టుకొనే మంచికాపరి మన ప్రభువు. దేవునికి స్తోత్రము. దేవునితోకూడ ఉండే ఆ పరలోకభాగ్యమును విడిచిపెట్టి నిన్ను నన్ను వెదకి రక్షించడానికి ఈ భూమిమీదకు నరావతారిగా అరుదెంచాడు. నశించినదానిని వెదకి రక్షించడానికే ఆయన వచ్చాడు. అందుకే నీవు దేవుని వెదకాలి. ఆయన సన్నిధిని వెదకాలి. మేలిమి బంగారముకంటెను అపరంజికంటెను దేవుని వలన కలుగు ఫలము మంచిది. ప్రశస్తమైన వెండికంటే నా వలన కలుగు ఫలము శ్రేష్టమైనదని, దేవుని వెదికేవారిని దేవుడు నీతిమార్గములయందు న్యాయమార్గములయందు నడిపిస్తాడని జ్ఞానియైన సొలొమోను వ్రాశాడు. కాబట్టి అశాశ్వతమైన వాటిని వెదకకుండ శాశ్వతుడైన నిత్యుడైన దేవుని వెదకాలి. అట్టివారికి దేవుడు సమస్తమైన ఆశీర్వాదములను అనుగ్రహిస్తాడు.

# దేవుని వెయ్యి ఆదేశములు

ధారావాహిక

## 237. "క్రీస్తు శరీరమందు శ్రమపడెను గనుక మీరును అట్టి మనస్సును ఆయుధముగా ధరించుకొనుడి." – 1 పేతురు 4:1

క్రీస్తును ధరించుకోవాలి అంటే క్రీస్తు మనస్సును ఆయుధముగా ధరించుకోవాలి. క్రీస్తు స్వభావము, శ్రమానుభవమును నీవు ధరించుకోవాలి అని దీని అర్థము. అనగా విశ్వాసి శ్రమపడుటకు సిద్ధముగా ఉండాలి. క్రీస్తు నీ హృదయంలో జీవిస్తున్నాడు గనుక నీవు శ్రమ, నొప్పి, బాధకు భయపడే అవసరము లేదు. ఎవరో నిన్ను బాధ పెడుతున్నప్పుడు నీవు క్రుంగి, కూలి, కృశించిపోయే పని లేదు. ఎందుకంటే క్రీస్తు నీలో ఉన్నందున నీవు ఆ పరిస్థితిని జయిస్తావు మరియు నిన్ను బాధపెట్టే వ్యక్తినికూడా ప్రేమించడానికి శక్తిని పొందుతావు. అది పరిశుద్ధాత్మశక్తి. అనగా నీవు నీ స్వభావాన్ని క్రీస్తు స్వభావంలోకి మార్చుకున్నావు. ప్రభువు నీకు సహాయం చేశాడు. కావున ఎవడైనను క్రీస్తునందుంటే వారికి ఇక ప్రాచీన స్వభావం ఉండదు. పాతస్థితి వెడలిపోయింది. నవీన స్వభావం ధరించుకొని నూతన సృష్టిగా మారిపోయావు. కావున శ్రమ అంటే విశ్వాసికి భయము లేదు. విశ్వాసి అనుభవమేమంటే శ్రమల్లో క్రీస్తు వారికి తోడుగా ఉంటాడు.

**"ప్రియులారా, మిమ్మును శోధించుటకు మీకు కలుగుచున్న అగ్నివంటి మహాశ్రమనుగూర్చి మీకేదో యొక వింత సంభవించునట్లు ఆశ్చర్యపడకుడి. క్రీస్తు మహిమ బయలుపరచబడినపుడు మీరు మహానందముతో సంతోషించు నిమిత్తము, క్రీస్తు శ్రమలలో మీరు పాలివారైయున్నంతగా సంతోషించుడి."** – 1 పేతురు 4:12,13

శ్రమలు అంటే మనకు ఆశ్చర్యము లేదు. శ్రమను తాళుకొనే శక్తి మనలో ఉంది. ప్రభువు మనల్ని ఎప్పుడూ ఒంటరిగా అనాథలుగా వదిలిపెట్టడు అనే విశ్వాసం, నిర్ధారణ మనలో ఉంది. మనం శ్రమల్లో సంతోషించడం, ఆనందించడం నేర్చుకొన్నాం. హింసించేవారికొరకు ప్రార్థిస్తున్నాము. వారిని మార్చు, క్షమించు, తప్పు నాదని ఎంచు అని వారి నిమిత్తం ప్రభువు వద్ద వేడుకొంటున్నాము. వారికొరకు ప్రార్థిస్తున్నాము, క్షమిస్తున్నాము; వారిని ఆశీర్వదించగలుగుతున్నాము. నిన్ను బాధించువారిని, శపించువారిని దీవిస్తే అక్కడ జయం లభిస్తుంది. నీకు శోధన, శ్రమలు కలిగినప్పుడు ఏదో వింతకార్యము జరిగిందని నీవు ఆలోచించే అవసరము లేదు. విశ్వాసికి ఎప్పుడైతే శ్రమ సంభవిస్తుందో అప్పుడు వారికి గొప్ప సంతోషం కలగాలి. క్రీస్తుకూడా శ్రమపడ్డాడు, మరణానుభవం పొందాడు; పాపముమీద విజయము పొందాడు. కావున నేను క్రీస్తుతోకూడా శ్రమపడుతున్నాను. తండ్రి క్రీస్తుకు విజయం ఇచ్చాడు. ఆ క్రీస్తు నాలో ఉన్నాడు కాబట్టి నాకు ఓటమి రాదు, జయమే కలుగుతుందని ఆనందించాలి. **"ఎవడైనను క్రైస్తవుడైనందుకు బాధ అనుభవించినయెడల అతడు సిగ్గుపడక, ఆ పేరును బట్టియే దేవుని మహిమపరచవలెను."** – 1 పేతురు 4:16

ఒకవేళ నీవు క్రైస్తవుడైనందున ఇప్పటివరకు బాధపడితే అలా బాధపడకూడదని తెలిసికోవాలి. నీవు ఆ పేరునిబట్టి దేవుని మహిమ పరచాలి. నీవు ఒక నిజమైన క్రైస్తవజీవితము జీవించాలంటే ఈ లోకములో తప్పక శ్రమ కలుగుతుందని ప్రభువు ముందుగానే చెప్పాడు. **"లోకములో మీకు శ్రమ కలుగును; అయినను ధైర్యము తెచ్చుకొనుడి, నేను లోకమును జయించి యున్నాననెను."** – యోహాను 16:33

**"కాబట్టి దేవుని చిత్తప్రకారము బాధపడువారు సత్ప్రవర్తన గలవారై, నమ్మకమైన సృష్టికర్తకు తమ ఆత్మలను అప్పగించుకొనవలెను."** – 1 పేతురు 4:19

మీ ఆత్మలను సృష్టికర్తకు అప్పగించుకోవాలి. కాని వారు – వీరు ఎందుకు ఇలా ప్రవర్తిస్తున్నారని తల బ్రద్దలు కొట్టుకునే అవసరము లేదు. చూడు, దేవుడు నిన్ను తన అరచేతులమీద చెక్కుకొనియున్నాడు. నీ తలవెండ్రుకల్లో ఒక వెండ్రుక నేలకు రాలాలన్నా ఆయన సెలవు కావాలి. కావున నీవేమి కలవరపడొద్దు. నీ ప్రాణము, ఆత్మ, శరీరము ఆయనకు అప్పగించుకొనియున్నావు గనుక ఆయన సెలవు లేకుండా నీకు ఏదీ సంభవించదనే ధైర్యం కలిగి ఉండాలి. దేవుని చిత్తప్రకారమే ఈ లోకంలో శ్రమపొందాలి. ఒకవేళ ఆ శ్రమ రావడం దేవుని చిత్తమైతే సంపూర్ణంగా నీ ఆత్మను ఆయన చిత్తానికి అప్పగించుకోవాలి.

## 238. "మీలో ఎవనికైనను జ్ఞానము కొదువగా ఉన్నయెడల అతడు దేవుని అడుగవలెను, అప్పడది అతనికి అనుగ్రహింపబడును." – యాకోబు 1:5

జ్ఞానము కొదువగా ఉంటే అడగమని దేవుడు అంటున్నాడు. అడిగినవారిని గద్దించక ధారాళంగా ఇస్తానని చెబుతున్నాడు. **"...ఆయన ఎవనిని గద్దింపక అందరికిని ధారాళముగ దయచేయువాడు. అయితే అతడు ఏమాత్రమును సందేహింపక విశ్వాసముతో అడుగవలెను; సందేహించువాడు గాలిచేత రేపబడి యెగిరిపడు సముద్ర తరంగమును పోలియుండును. అట్టి మనుష్యుడు ద్విమనస్కుడై, తన సమస్త మార్గములయందు అస్థిరుడు గనుక ప్రభువువలన తనకేమైనను దొరుకునని తలంచుకొనరాదు."** – యాకోబు 1:5-8. ఇవి ఆత్మావేశంతో వ్రాసిన దేవుని మాటలు. నీకు జ్ఞానము కొదువగా ఉండి లోకంలో జ్ఞానహీనునిగా, బుద్ధిహీనునిగా జీవించడం దేవునికి ఇష్టము లేదు. తాను సృజించిన మానవులు జ్ఞానమును అడిగి పొందడము ఆయనకు చాలా ఇష్టము.

జ్ఞానము దేనికి అవసరము? **"మీ విశ్వాసమునకు కలుగు పరీక్ష ఓర్పును పుట్టించునని యెరిగి, మీరు నానా విధములైన శోధనలలో పడునప్పుడు, అది మహానందమని యెంచుకొనుడి. మీరు సంపూర్ణులును, అనూనాంగులును, ఏ విషయములోనైనను కొదువలేనివారునై యుండునట్లు ఓర్పు తన క్రియను కొనసాగింపనీయుడి."** – యాకోబు 1:2-4. విశ్వాసులకు శ్రమలు వచ్చినప్పుడు వెంటనే మనస్సు కలత చెంది అధైర్యపడతారు. నేనింతగా ప్రార్థిస్తున్నాను; ఇంత వాక్యము చదువుతున్నాను; ఇన్నిసార్లు మందిరమునకు వెళ్తున్నాను; నాకెందుకు శ్రమ వచ్చింది? అని అంటారు. కాని దేవుడు నీకు ఏదో మేలు చేయనుద్దేశించి ఆ బాధను కలుగజేశాడు. ఆ జ్ఞానం నీకు కావాలి. **"దేవుని ప్రేమించువారికి, అనగా ఆయన సంకల్పముచొప్పున పిలువబడినవారికి, మేలుకలుగుటకై సమస్తమును సమకూడి జరుగుచున్నవని యెరుగుదుము."** – రోమా 8:28. నీకు గల పరిమితమైన జ్ఞానంతో శ్రమలద్వారా వచ్చే ఆశీర్వాదములను తెలిసికోలేవు. కావున నీకు దేవునిగూర్చిన జ్ఞానం చాలా అవసరము. నీవు సందేహించక దేవుని జ్ఞానము అడగాలి. నీవు రెండు తలంపులతో ఉండొద్దు. దేవుడు ద్విమనస్కులను ద్వేషిస్తాడు. నీవు దేవునిపై స్థిరమైన విశ్వాసము ఉంచాలి. కుటుంబమునకు ఆధిపత్యం వహించి కార్యాలు నిర్వర్తించాలంటే, సంఘాన్ని నడిపించాలంటే నాచేత కాదు; నా స్వబుద్ధి సరిపోదు; నాకు దైవికమైన జ్ఞానము కావాలని ప్రార్థించాలి. కుటుంబాన్ని పోషించాలన్నా; ఉద్యోగంలో రాణించాలన్నా; విజయవంతమైన క్రైస్తవ జీవితం జీవించాలన్నా జ్ఞానము ఎంతో అవసరము. **"ఇనుప ఆయుధము మొద్దుగా ఉన్నప్పుడు దానిని పదును చేయనియెడల పనిలో ఎక్కువ బలము వినియోగింపవలెను; అయితే కార్యసిద్ధికి జ్ఞానమే ప్రధానము."** – ప్రసంగి 10:10

జ్ఞానం అనేది రానున్న కీడును బయల్పరుస్తుంది; జరుగబోయేకార్యాలను తెలుపుతుంది; దేవుని ప్రణాళికను స్పష్టము చేస్తుంది గనుక ప్రతి ఒక్కరికి జ్ఞానం కావాలి. సొలొమోను రాజు దేవుని జ్ఞానము అడిగాడు. దేవుడు అతనికి గొప్ప జ్ఞానము ఇచ్చాడు. జ్ఞానముతో పాటు ఐశ్వర్యము, ఘనతను ఇచ్చాడు. కావున జ్ఞానము కలిగి నోరు తెరచునట్లు; నీ ప్రవర్తన జ్ఞానంతో కూడినదై యుండునట్లు; మూర్ఖులు, ముష్కరుల మధ్య దుర్మార్గపు వాతావరణంలో దేవుని బిడ్డగా జీవవాక్యము పట్టుకొని జ్యోతులవలె ప్రకాశించునట్లు జ్ఞానము దయచేయుమని ప్రతిరోజు ప్రార్థించాలి. దేవుడు నీకు తప్పక ధారాళమైన జ్ఞానాన్ని ఇస్తాడు.

## 239. "దీనుడైన సహోదరుడు తనకు కలిగిన ఉన్నతదశయందు అతిశయింపవలెను, ధనవంతుడైన సహోదరుడు తనకు కలిగిన దీనదశయందు అతిశయింపవలెను." - యాకోబు 1:9

ఎవరు అతిశయించాలి? పేదవాడు దేవునిలో అతిశయించాలి. అలాగే ధనవంతుడుకూడా దేవునిలో అతిశయించాలి. ఇద్దరూ అతిశయించుటకు గల కారణాలేవి? దీనునికిగల ఉన్నతస్థాయి ఏది? ధనవంతునికిగల దీనస్థాయి ఏది? అంటే, దేవుడు పక్షపాతికాడు; యేసు ప్రభువును అంగీకరించినప్పుడు నీవు దీనునివైనా, ధనవంతునివైనా దేవుడు ఇద్దరిని ఒకే రీతిగా చూస్తాడు. దేవునికి ధనంతో పనిలేదు; ఆయన నీ బ్యాంక్ బ్యాలెన్స్ అడగడు. కాని నీవు దేవుని రక్షకునిగా అంగీకరించి ఆయనే నీ పాలు, స్వాస్థ్యము కావడమే ముఖ్యము. **"ఒకడు సర్వలోకమును సంపాదించుకొని తన ప్రాణమును పోగొట్టుకొనుట వానికేమి ప్రయోజనము?"** - మార్కు 8:36. ధనవంతుడు తన ధనమందు గర్వించడమును దేవుడు కోరుకొనుట లేదు. పేదవానికి లోకంలో ధనము, స్థానమానాలు, ఇల్లు వాకిలి లేకున్నా వాడు తన పేదరికంలో శ్రీమంతుడైన దేవుని కనుగొంటే వాడే లోకంలో గొప్పవాడు. వాడు దేవునిలో ఆనందిస్తాడు. అదే అతని ఉన్నత స్థితి. అలా అతను తన దీనస్థితినుండి ఉన్నతస్థాయికి ఎదిగిపోతాడు. పెద్ద పెద్ద స్థానాల్లో ఉన్నవారు దిగివచ్చి మాకొరకు ప్రార్థించమని దీనులైనవారిని కోరుతారు. ధనం, బలం, స్థానమానాలు నెమ్మదినీయవు. దేవుడొక్కడే నెమ్మదినీయగలడు. ధనవంతులు నానా చిక్కుల్లో పడిపోతారు. ఎందుకంటే వారు దేవునికి స్థానమివ్వరు. దేవుని గూర్చిన తలంపుల కన్నా లోకంలోగల భోగభాగ్యాలమీద వారి దృష్టి ఉంటుంది గనుక వారికి దీనదశ ఉంటుంది. ఈ లోకంలో ఎవరు ధన్యులు? యెహోవా తమకు దేవుడుగా గల జనులు ధన్యులు. ధనవంతుడు దేవుని తెలిసికోవడం కష్టము. దుర్లభమని; ఒంటె సూది బెజ్జం గుండా వెళ్లగలుగుతుంది గాని ధనవంతుడు పరలోకరాజ్యం వెళ్లడం సులభం కాదని వాక్యంలో ఉంది. మరియు ఇది మనుష్యులకు అసాధ్యం గాని దేవునికి సమస్తము సాధ్యం అని కూడా వాక్యంలో చూస్తాము. ధనవంతుడు తన్నుతాను తగ్గించుకొని నాకు ధనం ముఖ్యం కాదు; నాకు దేవుడు, దేవుని సన్నిధి కావాలి; వెండిబంగారాలతో నాకు నెమ్మది కలుగడం లేదు; అవి నాతో మాట్లాడవు; నేను దేవుని రాజ్యాన్ని వెదకుతానంటే వెంటనే దేవుడు అతని హృదయంలోకి వస్తాడు. కావున ఆ దీనస్థితి నిమిత్తం ధనవంతుడు ఆనందించాలి. అతనికి దేవుడు అవసరం. తన హృదయంలో ఉన్న ఖాళీని ఎంత ధనంతో కూర్చుకున్నా దాన్ని పూరించలేడు. అది ధనవంతునికున్న దీనస్థితి. వాక్యంలో దీనులకు, బీదలకు సువార్త అందించాలని ఉంది. బీదలు ఎవరు? ధనం, ధాన్యం, ఇల్లు, వాకిలి లేనివారు బీదవారని అనుకుంటారు. దేవుడు లేనివారు అసలైన బీదవారు. ఎవరు శ్రీమంతులు? శ్రీమంతుడైన దేవుని సంతానమే శ్రీమంతులు. మనము దేవుని కలిగి ఉన్నాము గనుక మనకున్న ఈ ఉన్నత దశయందు అతిశయించాలి. పేదవారిని చూస్తే వారి ముఖమెంతో కాంతివంతంగా ఉంటుంది. చాలా ధనమున్నవారి ముఖముమీద ఎప్పుడూ కుచ్చులు, భయం, వారి వెంట సెక్యూరిటీ ఉంటుంది. సంతోషమున్న ఒక్క ధనవంతుని నేనింతవరకు చూడలేదు. పేదవాడు హాయిగా చేతులూపుకుంటూ హనోకు దేవునితో నడిచినట్లు నడిచి వెళ్తాడు. కావున ధనవంతుడు ధనసమృద్ధియందు ఆనందించక దేవుని కలిగియున్నానని సంతోషించాలి. దీనుడు తన దీనదశయందుగాక ఉన్నతుడైన దేవునియందు అతిశయించాలి.

## 240. "ప్రతి మనుష్యుడు వినుటకు వేగిరపడు వాడును, మాటలాడుటకు నిదానించువాడును, కోపించుటకు నిదానించువాడునై యుండవలెను."

- యాకోబు 1:19

కొందరు చాలా మాట్లాడుతుంటారు. వారిని వదరుబోతులని అంటారు. వారు అస్తమానం మాట్లాడుతుంటారు. అది విశ్వాసికి తగదు. నీ మాటలు సమయస్ఫూర్తిగా, న్యాయవంతంగా, సత్యంగా, కనికరముతో కూడినవిగా, కృపాసహితంగా ఉండాలి. విశ్వాసి నోరు తెరుచుటకు ముందు ఇది అవసరమా? న్యాయమా? సత్యమా? అని ఆలోచించాలి. వినుటకు వేగిరముగా ఉండాలి. ఎవరైనా మాట్లాడుతుంటే మాట్లాడుటకు ముందు శ్రద్ధగా వినాలి. ఈ వాక్యభాగం చదువుతుంటే సృష్టికర్త మనల్ని సృష్టించిన విధానం నాకు జ్ఞాపకం వచ్చింది. దేవుడు మానవునికి చూచుటకు రెండు కన్నులు; వినుటకు రెండు చెవులు ఇచ్చాడు గాని మాటలాడుటకు ఒకే నోరు ఇచ్చాడు. అంటే వినడం, చూడడం రెండంతలుగా ఉండాలి కాని మాటలు సగటుగా ఉండాలి. జ్ఞానముకలిగి నోరు తెరవాలి. **"జ్ఞానము కలిగి తన నోరు తెరచును కృపగల ఉపదేశము ఆమె బోధించును."** - సామెతలు 31:26 అని సొలొమోను జ్ఞానంగల స్త్రీని గురించి చెబుతున్నాడు. అలాగే కోపించుటకు నిదానించాలి. కొందరికి కోపం చాలా ఎక్కువగా ఉంటుంది. అది విశ్వాసికి తగదు. **"సాత్వికులు ధన్యులు; వారు భూలోకమును స్వతంత్రించుకొందురు."** - మత్తయి 5:5. ఒక మంచి కార్యముకొరకు కోపగించుకొనుటలో అర్థముంటుంది. పాపంతో రాజీపడకుండా అక్రమము చూచినప్పుడు నీకు దైవికమైన కోపం రావాలి. అదికూడా క్షణభంగురమైనదిగా, కార్యం నెరవేర్చేదిగా ఉండాలి. వెంటనే నీ హృదయం పరిశుద్ధమైపోవాలి. యేసుప్రభువుకూడా కోపించాడు. ఆలయమంతా చిందరవందరగా ఉన్నప్పుడు కొరడాలు తీసికొని వ్యాపారుల బల్లలు పడద్రోశాడు; పిట్టలు, గువ్వలను ఎగురగొట్టాడు; డబ్బు సంచులను పారవేశాడు. ఆ కోపం నిమిషమాత్రమే ఉంది. ఆ వెంటనే గ్రుడ్డి, కుంటి, చెవిటివారిని కనికరించి వారిని ముట్టి స్వస్థపరచాడు. కేవలము ఆ కార్యము నెరవేరుటకే కోపగించుకున్నాడు. కావున నీ కోపం ఒక మంచి కార్యముకొరకైనదిగా ఉండాలి. దేవుని కోపము నిమిషమాత్రము, దయ ఆయుష్కాలమంత అని వాక్యం సెలవిస్తుంది. నీకు అకారణంగా కోపం రావడం; మనుష్యులను గాయపరచి ఆనందించడం దేవునికి ఇష్టము కాదు. మంచి ఉద్దేశముతో కోపించినా వెంటనే ప్రేమతో ఆ కోపాన్ని కప్పాలి. కోపపడాలి గాని పాపం చెయ్యొద్దు. అధికంగా మాట్లాడడం, పౌరుషం కలిగి ఉండడం దేవుని బిడ్డలకు తగదు. వినుటకు వేగిరం; మాట్లాడుటకు, కోపించుటకు నిదానం అవసరం. విస్తారమైన మాటల్లో దోషముండక మానదు. ప్రార్థనపరులు, అభిషిక్తులు ఎక్కువగా మాట్లాడరు. ప్రజలతో ఎక్కువ సన్నిహితంగా మెలగాలని గాక దేవునితో ఎక్కువగా సంబంధం కలిగి ఉండాలని, దేవునితో మాట్లాడాలని కోరుతుంటారు. వదరుబోతుతనం, కోపం నీలో ఉంటే అవి పాపముల లెక్కలోకి వస్తాయి. వాటిద్వారా నీకు ఏ ప్రయోజనము, దీవెన రాదు. అవి కలకలం, కలవరమునే సృష్టిస్తాయి; అసమాధానము తెచ్చిపెడతాయి గనుక నీవు వీటన్నిటిని మానుకోవాలి. ❀

# దేవుడు చేసిన అద్భుతకార్యములు

**1. బిందు:** నేను ఏప్రిల్ 2022 నుండి మూడు నెలలుగా అధిక రక్తస్రావంతో బాధ పడ్డాను. నేను యు.పి.ఎఫ్. సంఘానికి ఫోన్ చేసి అమ్మగారితో ప్రార్థన చేయించుకొన్నాను. అమ్మగారు ప్రార్థన చేసిన తరువాత నాకు మరల అధిక రక్త స్రావం, నడుము నొప్పి ఎప్పుడూ రాలేదు. నాకు ఆరు నెలలనుండి కాళ్ల నొప్పికూడా విపరీతంగా ఉండేది. జూమ్ ప్రార్థనలో అమ్మగారు ఇతరులకు ప్రార్థన చేస్తుంటే నేను నా కాళ్లమీద చెయ్యి పెట్టుకొని ప్రార్థనలో ఏకీభవించేదాన్ని. ఆ విధంగా దేవుడు నాకు స్వస్థత అనుగ్రహించాడు. మరియు నా కుడి కంటిలో ఉన్న నొప్పి పోయి సంపూర్ణ స్వస్థత వచ్చింది. ఆలాగే దేవుడు నా షుగర్ స్థాయికూడా సాధారణ స్థాయికి వచ్చేలా చేశాడు. ఇప్పుడు 400 షుగర్ నుండి 100 కి 150 కి మధ్య ఉంటుంది. నా గురించి ప్రార్థించిన అమ్మగారికి సంఘానికి ప్రత్యేక వందనములు. దేవునికి స్తోత్రములు.

**2. శ్రీలత:** నా సహోదరుడు చంద్రశేఖర్ రెడ్డి లివర్ సిర్రోసిస్ (కాలేయ కాఠిన్యత వ్యాధి)తో బాధపడుతున్నాడు. అప్పుడు ఎవరో యు.పి.ఎఫ్. సంఘముగూర్చి చెబితే నేను వెంటనే అమ్మగారిని సంప్రదించాను. ఎప్పుడైతే అమ్మగారు ప్రార్థన చేసి ఇచ్చిన ప్రార్థన నూనె వాడామో అప్పుడు చేసిన పెట్ స్కాన్‌లో అది క్యాన్సర్ కాదు అని తేలింది. ఇది దేవుడు మా జీవితంలో చేసిన గొప్ప అద్భుతం. డాక్టర్లు కాలేయ మార్పిడి చేయాలన్నారు కాని అమ్మగారు కత్తి పడకుండా దేవుడు తప్పిస్తాడని చెప్పారు. దేవుని నామమునకు నా వందనములు. కీడు అపాయం కొట్టివేసిన దేవునికి స్తోత్రములు. అమ్మగారికి యు.పి.ఎఫ్. సంఘానికి కృతజ్ఞతలు.

**3. మమత:** మా చిన్న బాబు కెవిన్‌కు బాగోలేకపోతే హాస్పిటల్‌కు తీసికొని వెళ్లాము. డాక్టర్స్ చూసి హైడ్రోసెల్ (బుడ్డ) వచ్చిందని చెప్పారు. అది తగ్గొచ్చు లేదా ఇంకా పెరగవచ్చు అని చెప్పారు. అయితే దాని పరిమాణం రోజురోజుకు పెరుగుతూనే ఉంది. డాక్టర్లు స్కానింగ్ చేసి అంతా నీరు చేరిపోయింది; సర్జరీ చేసి తీసివేయాలి అన్నారు. బాబు వయస్సు 8 సంవత్సరాలు మాత్రమే గనుక ఏలాగు తట్టుకొంటాడో అని మొఱ్ఱపెట్టుకొన్నాను. యు.పి.ఎఫ్. సంఘమునకు ఫోన్ చేసి ప్రార్థన విన్నపము తెలియజేశాను. అమ్మగారు, సంఘము అంతా బాబుకొరకు ప్రార్థించారు. దేవుడు గొప్పకార్యం చేశాడు. ఆపరేషన్ చాలా విజయవంతంగా జరిగింది. బాబుకు స్వస్థత కలిగింది. దేవునికే సమస్త మహిమ చెల్లునుగాక. ప్రార్థించిన అమ్మగారికి, సంఘానికి నా నిండు వందనములు.

**4. కాసినేని అరుణ:** మా కుమారుడు కిషన్ రావ్ 2022-2023 సంవత్సరము బి.టెక్ 3వ సంవత్సరము చదువుతున్న సమయంలో ఒక సమస్య తలెత్తింది. అతను తన ఖాళీ సమయంలో క్రికెట్ బాగా ఆడుతాడు. అయితే ఆ సమయంలో అతని మోచేయి నరం పట్టేసి ఆరు నెలలు బాధ పడ్డాడు. ఆ నొప్పివలన చిన్న మగ్గుతోకూడా నీళ్లు పట్టుకోలేని పరిస్థితి వచ్చింది. నేను వాట్సాప్‌ద్వారా యు.పి.ఎఫ్. "దైవిక స్వస్థత" పుస్తకములోని వాగ్దానములు పంపాను. అలాగే అతని దగ్గర ఉన్న నూనెకొరకు ఫోన్‌లో దేవుని నామమున ప్రార్థించాను. నా కుమారుడు వాట్సాప్‌లో పంపిన స్వస్థత వాగ్దానములు చదివి, ప్రార్థన నూనె రాచుకొని ఆ రాత్రి పడుకొన్నాడు. తెల్లవారిన తరువాత ఫోన్ చేసి - అమ్మా నాకు నొప్పి ఎలా పోయిందో కూడా తెలియలేదు అని చెప్పాడు. దేవునికి స్తోత్రములు. దేవుని మహాకృపను బట్టి ఎటువంటి సమస్యలు ఉన్నా యు.పి.ఎఫ్. 24 గంటల నిరంతర ప్రార్థనలో పెట్టి ప్రార్థిస్తున్నాను.

మరియు మా కుమారునికి 2023వ సంవత్సరము మొదట్లో ఛాతి భాగంలో కుంకుడు కాయంత గడ్డ వచ్చింది. అమ్మగారు, యు.పి.ఎఫ్. సంఘము అంతా ప్రార్థించారు. డాక్టర్లు సర్జరీ చేయాలని భయపెట్టారు కాని దేవుని మహా కృపద్వారా ఆ గడ్డ మొత్తానికి తగ్గిపోయింది. ఇప్పుడు ఏమీ లేదు. దేవునికే సమస్త మహిమ, ఘనత, ప్రభావములు చెల్లును గాక. ప్రార్థించిన అమ్మగారికి సంఘానికి వందనములు.

**5. రమా విజయ్, వారాసిగూడ:** యు.పి.ఎఫ్. పరిచర్య జాయ్ అమ్మగారి పరిచర్యద్వారా నేను చాలా బలపడ్డాను. 2019, మే 100 రోజుల ప్రార్థన సమయంలో నేను వచ్చాను. ఆల్‌నైట్ ప్రేయర్స్‌కి కూడా చాలా సార్లు వచ్చాను. అమ్మగారి వాక్యం బట్టి, అమ్మగారు వ్రాసిన పుస్తకాలు – నామములు, వాగ్దానములు, జీవపు మాటలు బట్టి నా పర్సనల్ ఫ్యామిలీ ప్రాబ్లమ్స్‌నుండి నేను చాలా ధైర్యం పొందాను. నేను ఎవ్వరికైనా బహుమతి ఇవ్వాలి అనుకుంటే అవే పుస్తకాలు ఇచ్చేదాన్ని. నాకు సేవా పిలుపు ఉంది. నా పరిచర్య అంతా ఎక్కువగా దేవుని ఎరుగని కుటుంబాల మధ్య ఉంటుంది. నేను దేవుని ఎరుగని కుటుంబమునుండి వచ్చి రక్షింపబడ్డాను. నేను దేవున్ని చాలా వ్యతిరేకించేదాన్ని. కానీ దేవుడు నా కఠినహృదయమును మార్చి ఆయనే నిజమైన దేవుడు, సజీవుడైన దేవుడు, పరిశుద్ధుడైన దేవుడు అని కనుపరచుకున్నాడు. 100 రోజుల ప్రార్థన సమయమున జాయ్ అమ్మగారు ఒక మాట పదే పదే చెప్పారు. "ఇక్కడ ప్రారంభమైన ప్రార్థన అగ్ని చుట్టు ప్రక్కల అంటుకోవాలి" అని చెప్పారు. నా జీవితంలో ఆ ప్రార్థన అగ్ని అంటుకున్నది అనే చెప్పొచ్చు. అప్పటినుండి ఇప్పటివరకు మా ఇంట్లో ప్రతి రోజు ఉదయము 4.50 ని॥ల నుండి 6.00 గం॥ల వరకు ప్రేయర్ ఉంటుంది. నా ఉద్యోగం కూడా వదిలేసి దేవుని సేవ చేస్తున్నాను. సేవలోకూడా ఎన్నో కష్టాలు, వ్యతిరేకతలతో, క్రుంగిపోయి నప్పుడు జాయ్ అమ్మగారు చెప్పిన వాక్యాలు, కౌన్సెలింగ్ నన్ను ఎంతో ధైర్యపరచాయి. అమ్మగారు చేసిన పరిచర్యద్వారా నేను ఎన్నో దీవెనలు పొందాను. నేను సేవలో ఎంతో మందికి అమ్మగారి మెసేజ్ లింక్స్‌కూడా పంపుతుంటాను. సమస్త మహిమ దేవునికే చెల్లును గాక.

**6. లియోనార్డ్ పురుషోత్తం:** నేను సెంటినరీ బాప్టిస్టు సంఘ సభ్యుడిని. నాకు జాయ్ చెరియన్ అమ్మగారి పరిచర్య ఎప్పటినుండి తెలుసు. అంటే నేను "సేవా భారత్ మిషన్ ఇండియా"లో అకౌంటెంట్‌గా పని చేసేవాడిని. ఆ సమయంలో ఇన్‌కమ్ టాక్స్ కేసుమీద మా రికార్డ్స్ అన్నీ సబ్మిట్ చేయవలసిన పరిస్థితి వచ్చినప్పుడు, అక్కడున్న ఇన్‌కమ్ టాక్స్ ఆఫీసర్‌కు దేవుడు అంటే తెలియదు. తన కోడలుకి పిల్లలు పుట్టలేదు. మేము అక్కడకు వెళ్ళినపుడు ఇన్‌కమ్ టాక్స్ ఆఫీసర్ మా రికార్డ్స్ అన్నీ చెక్ చేస్తూ మీరు క్రిష్టియన్స్ కదా అని అన్నారు. మా కోడలుకి పిల్లలు పుట్టడం లేదు అని మా డైరెక్టర్‌కు కబురు పెట్టించారు. ప్రార్థన కోసం నేను మొదటిసారి జాయ్ అమ్మగారిని కలుసుకోవడం, వాళ్ళ కోడలుకి ఎస్కార్ట్‌గా ఉండి అమ్మగారి దగ్గరకు తీసుకెళ్ళడం జరిగింది. అమ్మగారు ఆ ఆఫీసర్ యొక్క కోడలిని క్రీస్తును గూర్చిన సాక్ష్యంద్వారా బలపరచి, ప్రార్థించారు. అమ్మగారి ప్రార్థనవల్ల వారి కోడలికి పాప పుట్టింది. నా

భార్య పేరు లావణ్య లియోనార్డ్, మాకు 2006 వ సంవత్సరంలో ఒక పాప జన్మించింది. 2011వ సంవత్సరంలో మరొక కుమారుడుని 7వ నెలలోనే కడుపులో నుంచి తీసివేయవలసి వచ్చింది. చాలాకాలం మేము ప్రార్థన చేశాము. 2016వ సంవత్సరంలో మీకు పిల్లలు పుట్టడానికి ఇది చివరి అవకాశం అని డాక్టర్స్ మాతో చెప్పడం జరిగింది. మాకున్న కొద్దిపాటి పరిచయంతో సంపూర్ణ రాత్రి ప్రార్థనలో జాయ్ అమ్మగారిని మా గురించి ప్రార్థన చేయమని అడిగాము. నా భార్య కడుపుమీద చేయిపెట్టి ప్రార్థించి, నీకు పండంటి చక్కటి కుమారుడు పుడతాడు, అతన్ని సేవకుడుగా చేయాలి అని ప్రార్థన చేసి ప్రవచనం ఇచ్చారు. నా భార్యకు మూడవ నెలలో చాలా బ్లీడింగ్ అయ్యింది. దాని తర్వాత 36 ఇంజెక్షన్స్ ప్రతి వారం తీసికోవాల్సి వచ్చింది. దేవుడు మమ్మును దీవించి మాకు చక్కని కుమారుని ఇచ్చాడు. జాయ్ అమ్మగారు నన్ను నా కుటుంబాన్ని ఎంతో ఆదరించి, ఆత్మీయంగా బలపరచారు. నా భార్య 2022 వ సంవత్సరంలో క్యాన్సర్ తో ప్రభువు సన్నిధిని చేరుకుంది. దేవునికి స్తోత్రములు. మా కొరకు ప్రార్థించిన అమ్మగారికి వందనములు. దేవునికి స్తోత్రములు. మా కొరకు ప్రార్థించిన అమ్మగారికి వందనములు.

**7. పూర్ణ చంద్రపాల్, రాంనగర్:** నేను యు.పి.ఎఫ్. సభ్యుడిని అని గర్వంగా చెప్పుకుంటున్నాను. నేను ప్రకాశం జిల్లాలో ఉద్యోగం చేస్తున్నప్పుడు నాకు దేవుని స్వరం వినిపించింది. హైదరాబాద్ వెళ్లు అని స్వరం వినబడగానే నేను వెంటనే సరెండర్ అయిపోయాను. నా చిన్నతనంనుండి దేవుడంటే భయభక్తులు కలిగి దేవునిమీద విశ్వాసము ఉంచినవాడిని. నేను చిన్నప్పటి నుండి ఎన్నో సువార్తలు వింటున్నా కానీ ఏ సువార్త నాలోకి ఎక్కటం లేదు. ఏ వర్తమానం నన్ను కదిలించలేదు. మరి దేవుడు అయితే నన్ను హైదరాబాదుకి నడిపించాడు. నేను క్రైస్తవుడనే, దేవుడంటే తెలుసు, బైబిలు చదువుతాను ప్రార్థన చేస్తాను. అయినా ఏ సువార్త నాలో ప్రవేశించడం లేదు. నన్ను హైదరాబాదుకి ఎందుకు నడిపించావో బయలుపరచు దేవా అని ప్రతిదినం ప్రార్థించాను. ఆవిధంగా దాదాపు మూడు నెలలు ప్రార్థించాను. ఒక ఆదివారం ఉ॥ 6 గం॥లకి ఒక తల్లి ఇద్దరు పిల్లలు బైబిలు పట్టుకొని రోడ్డుమీద వెళ్తున్నారు. అమ్మా, మీరు ఏ సంఘానికి వెళ్తున్నారు అని అడిగాను. వారు యు.పి.ఎఫ్. సంఘానికి వెళ్తాము అని చెప్పి నా చేతిలో దేవుని వెయ్యి నామముల పుస్తకము పెట్టారు. దానిమీద అడ్రసు చూసి ఆ సంఘము ఎక్కడుంది అని వెదికాను కాని నేను క్రొత్త కాబట్టి ఆ సంఘాన్ని కనుక్కోలేకపోయాను. మా అపార్ట్మెంట్లో ఒకతన్ని యు.పి.ఎఫ్. మందిరము ఎక్కడ అని అడిగాను. మేము సాయంత్రం ఆ మందిరంకే వెళ్తాము, మీరుకూడ రండి అని చెప్పాడు. నేను మనస్సులోనే మార్గం చూపించావు దేవా! అని అనుకొన్నాను. ఆ సాయంత్రం అమ్మగారు జి.ఎస్. గార్డెన్లో వాక్యం చెబుతున్నారు. ఆ వాక్యం విన్నప్పుడు నాకు అమ్మగారి స్వరంనుండి సత్యం వినబడుతుంది. అమ్మగారి వాక్యంలో జీవమార్గం కనబడింది. అదే రోజు నేను అమ్మగారిని కలిశాను. నేను యు.పి.ఎఫ్. సంఘములోనే బాప్తిస్మము తీసికున్నాను. థియోలజీలో డిగ్రీ తీసికున్నాను. 31వ యు.పి.ఎఫ్. వార్షికోత్సవంలో అమ్మగారు ఎనిమిది మందికి ఆర్డినేషన్ ఇచ్చారు. అందులో నేను కూడా ఒకడిని. నేను యు.పి.ఎఫ్. సంఘములో ఎంతగానో నాటుకొనిపోయాను. అంటే నేను కుడికి గాని ఎడమకుగాని తిరుగను. నేను దేవునితో యు.పి.ఎఫ్. మందిరముతో ఎంతగానో అంటుకట్టబడి ఉన్నాను. దేవునికే సమస్త మహిమ చెల్లును గాక! అమ్మగారికి నా వందనములు.

**8. ప్రసాద్ పీటర్, ఎల్.బి. నగర్:** నేను యు.పి.ఎఫ్. సంఘానికి 15 సం॥ల నుండి వస్తున్నాను. యు.పి.ఎఫ్. సంఘంద్వారా ఎన్నో మేళ్లు అద్భుతాలు ఆశ్చర్యకార్యాలు పొందాను. దీన్నిబట్టి దేవాది దేవుని స్తుతిస్తున్నాను. అమ్మగారికి వందనాలు. నా రెండు కళ్లకి క్యాటరాక్ట్ ఆపరేషన్ అయింది. ఎడమ కంటికి కొవిడ్ రాకముందు జరిగింది. ఆపరేషన్ అయిన నెలకే కొవిడ్ వచ్చింది. ఆపరేషన్ అయిన 3 సం॥రాల తర్వాత కుడి కంటిలో సమస్య అనిపించి ఆసుపత్రికి వెళ్తే డాక్టర్లు వెంటనే ఆపరేషన్ చేయాలి అన్నారు. ఆపరేషన్ అయింది. మళ్లీ 15 రోజుల తర్వాత రమ్మన్నారు. కాని ఆపరేషన్ జరిగిన మూడు రోజులకే కన్ను కొంచెం నొప్పిగా ఉంటే డాక్టర్‌కి చూపించాను. డాక్టరు – కంటిలో ఒక చిన్న ముక్క అలాగే ఉండిపోయినట్లుంది క్లీన్ చేయాలి అని చెప్పారు. మళ్లీ వెంటనే ఆపరేషన్ చేశారు. మన యు.పి.ఎఫ్. సంఘ సభ్యులు, పాస్టర్లు, జాయ్ అమ్మ గారు అందరూ ప్రార్థన చేశారు. నేను సంపూర్ణ స్వస్థత పొందాను. దేవునికి స్తోత్రములు.

**9. ఉష, భద్రాచలం:** నేను జాయ్ అమ్మగారి వాక్యాలు టి.వి. మరియు యూట్యూబులో వింటుండేదాన్ని. నన్ను యు.పి.ఎఫ్.లోని ఒక సహోదరి జూమ్‌లో కనెక్ట్ చేశారు. నాకు ఎలా ప్రార్థించాలోకూడా తెలిసేది కాదు. మా కుటుంబంనుండి నేను ఒక్కదాన్నే రక్షణ పొందాను. కేవలం ఈ జూమ్ ప్రార్థనలవలన మా అమ్మగారు అస్వస్థతనుండి కోలుకున్నారు. ఈ ప్రార్థనలవలన నేనెంతో బలపడ్డాను. నాకెలాంటి శ్రమ, శోధన వచ్చినా ఈ 24 గం॥ల ప్రార్థనలద్వారా, జాయ్ అమ్మగారు చెప్పే వాక్యాలద్వారా జయించగలుగుతున్నాను. మా బంధుమిత్రులకు కాని, ఆఫీసులోని స్నేహితులకు కాని ఎలాంటి ప్రార్థన అవసరతలు ఉన్నా నేను జూమ్‌లో చెప్పడం, ప్రేయర్ వారియర్స్ వెంటనే స్పందించి ప్రార్థిస్తే కోలుకోవడం జరిగింది. యు.పి.ఎఫ్. సభ్యులందరికి, జాయ్ అమ్మగారికి వందనాలు. దేవునికే సమస్త మహిమ ఘనత చెల్లును గాక!

**10. ఉషారాణి:** నేను జూమ్ ప్రార్థనలద్వారా ఆత్మీయంగా ఎంతో బలపడుతున్నాను. నాకెంతో ప్రార్థన సహకారం లభిస్తుంది. అమ్మగారు మా కుటుంబం గురించి ఎప్పుడూ ప్రార్థిస్తారు. అమ్మగారికి ప్రత్యేక వందనాలు. మా వారు చనిపోయారు. మా బాబు ఉద్యోగ విషయంలో కూడా నేను యు.పి.ఎఫ్. కి ప్రార్థన విన్నపం ఇచ్చాను. బాబు, యు.కె.లో ఎమ్.ఎస్. చదివాడు. దేవుడు తన మహా కృపనుబట్టి, దయతలచి, కృపచూపించి యు.కె.లోనే బాబుకు ఉద్యోగమిచ్చాడు. ఉద్యోగం వల్ల బాబుకెంతో ధైర్యం, సంతోషం కలిగాయి. అలాగే దేవునికెంతో కృతజ్ఞతలు చెల్లించాడు. జూమ్ లీడర్లందరూ ఎంతో చక్కగా నడిపిస్తున్నారు. వారికి వందనాలు. దేవునికే సమస్త మహిమ చెల్లునుగాక.

**11. సుమ రావెల:** మా మేనత్త కూతురు విజయవాడలో డాక్టరుగా ఉద్యోగం చేస్తుంది. అయితే వాళ్లకి పర్మనెంట్ పోస్టులు ఇస్తున్నారని, కౌన్సెలింగ్ ఉందని నాకు ప్రార్థన విన్నపం ఇచ్చింది. నేను యు.పి.ఎఫ్. సంఘానికి ఫోన్ చేసి 24 గం॥ల నిరంతర ప్రార్థనల్లో ప్రార్థన విన్నపం ఇచ్చాను. వారి ప్రార్థనలవలన దేవుని మహా కృపనుబట్టి తాను అనుకున్న డిపార్ట్‌మెంట్‌లోనే మెడికల్ ఆఫీసరుగా పర్మనెంట్ పోస్టు వచ్చింది. యు.పి.ఎఫ్. లో ఏ ప్రార్థన విన్నపం ఇచ్చినా దేవుడు కార్యం జరిగిస్తున్నాడు. దేవునికి స్తోత్రములు. సమస్త మహిమ దేవునికే చెల్లును గాక!

**12. ప్రతిభ, అనకాపల్లి:** మా నాన్నగారికి ఆరోగ్యం బాగోలేక ఐ.సి.యు.లో అడ్మిట్ అయ్యారు. హార్ట్ బీట్ ఎక్కువగా ఉండడం, ఆయాసంగా ఉండడం వలన అడ్మిట్ చేయాల్సి వచ్చింది. హాస్పిటల్‌లో

పరీక్షలు చేస్తే లంగ్స్ ఇన్ఫెక్షన్, యూరిన్ ఇన్ఫెక్షన్ అని తెలిసింది. నేను యు.పి.ఎఫ్. సంఘానికి ఫోన్ చేసి ప్రార్థన విన్నపం తెలియజేశాను. మా నాన్నగారి వయస్సు 75 సం॥లు. దేవుని మహా కృపనుబట్టి ఐ.సి.యు. నుండి సాధారణ వార్డుకి మార్చారు. ఆ తర్వాత ఆసుపత్రినుండి డిశ్చార్జి కూడా చేశారు. యు.పి.ఎఫ్. సభ్యులందరు ఎంతగానో ప్రార్థన చేశారు. అందరికీ నా నిండు వందనాలు తెలియజేస్తున్నాను. దేవునికే సమస్త మహిమ చెల్లును గాక.

**13. శైలజ, విజయవాడ:** మా పిల్లలకి మంచి క్రిస్టియన్ స్కూల్‌లో అడ్మిషన్ దొరకాలని యు.పి.ఎఫ్. సంఘానికి ఫోన్ చేసి ప్రార్థన విన్నపం తెలియజేశాను. అలాగే మేము అప్పులతో ఉన్నాము. కాబట్టి మా సొంత ఇంటిని వదిలి అద్దె ఇంటికి వెళ్లాలనికూడ ప్రార్థన విన్నపం ఇచ్చాను. జాయ్ అమ్మగారు మరియు ప్రార్థన వీరులుకూడా ప్రార్థన చేశారు. దేవుని మహా కృపనుబట్టి పిల్లలకి మంచి స్కూలులో అడ్మిషన్ లభించింది. అలాగే మా స్థితినిబట్టి తక్కువ అద్దెతో మంచి ఇల్లు దొరికింది. యు.పి.ఎఫ్. సంఘ సభ్యులందరికి నా ప్రత్యేక వందనాలు. దేవునికి స్తోత్రములు. సమస్త మహిమ దేవునికే చెల్లును గాక!

**14. రజని:** నేను 2012 నుండి 2013 వరకు దురాత్మలచేత పీడింపబడినదానిలా ఉండి ఆ రెండు సంవత్సరాలు ఎంతో బాధపడ్డాను. 2014 నుండి 2022 వరకు మందులు వాడుతుండేదాన్ని. మధ్యలో మందులు మానేస్తే ఎంతో ఆందోళనగా నిరుత్సాహంగా ఉండేది. అప్పుడు మళ్లీ మందులు వాడేదాన్ని. 2023, జనవరి నెలలో నేను అమ్మగారి దగ్గర ప్రార్థన చేయించుకొనినప్పటినుండి మందులు వేసికోవడం మానేశాను. నేను ఉదయాన్నే దేవుని సన్నిధిని వెదకడంవలన నా హృదయంలో నెమ్మది సంతోషం, నా ఎముకలకు సత్తువ కలిగింది. నాకెంతో ధైర్యంగా ఉంది. దేవుడు నాకు 13 సంవత్సరాల తర్వాత మందులనుండి విడుదల అనుగ్రహించాడు. యు.పి.ఎఫ్. సహవాసాన్నిబట్టి అమ్మగారికి, పాస్టర్లకందరికి వందనాలు తెలియజేస్తున్నాను. సమస్త మహిమ దేవునికే చెల్లును గాక!

**15. రాధమ్మ, రాంనగర్:** నేను యు.పి.ఎఫ్. సంఘానికి వచ్చి చాలా బలపడ్డాను. చదువులేని నన్ను జాయ్ అమ్మగారిద్వారా దేవుడు ప్రార్థన వీరులలో ఒక దానిగా నిలబెట్టాడు. యు.పి.ఎఫ్. సంఘానికి వచ్చి దేవుని వాక్యంలో ఎదుగుతూ బలమైన ప్రార్థన నేర్చుకున్నాను. నాకు సాధ్యమైనంతవరకు దేవుని నామములను వాగ్దానములను ప్రతిరోజు ధ్యానిస్తాను. 2020వ సం॥లో నాకు కొంచెం దమ్ము ఆయాసంలాగా వచ్చింది. దేనివలన వస్తుందో అని నేను పట్టించుకోలేదు. ఇలా రెండు సంవత్సరాలు ఇబ్బందిపడ్డాను. 2022వ సంవత్సరంలో నడుస్తుంటే ఇబ్బంది ఎక్కువైంది. దేనివల్ల అవుతుంది... వయస్సు పైబడినందునా... అనే ఆలోచనలు. డాక్టర్ దగ్గరకెళ్లి పరీక్ష చేయించుకున్నాను. మందులు ఇచ్చారు. కొంచెం తగ్గినట్లుగా ఉంది. 2023లో కూడ మళ్లీ సమస్య ఎక్కువైంది. నేను మా ఊరు (ఆంధ్ర) వెళ్లాను. మా కుటుంబ సభ్యులు నన్ను సరిగా పట్టించుకోలేదు. ఆ సమయంలో జాయ్ అమ్మగారు నాకు చాలా సహాయం చేశారు. ఆసుపత్రికి వెళ్లాను. డాక్టరు గారు – ఆపరేషన్ చెయ్యాలి డబ్బులు కాని, ఆరోగ్యశ్రీ కార్డు కాని తీసికొని రా అని చెప్పారు. ఎందుకో తెలియదు గాని ఓ రోజు కొబ్బరి చెట్టు క్రింద కూర్చున్నాను. చెట్టునిండా కొబ్బరి కాయలు ఉన్నాయి. తలమీద పడాల్సిన కొబ్బరికాయ చేతిమీద పడి చేయి విరిగింది. ఏ ఆసుపత్రికెళ్లినా చాలా డబ్బులు అడిగారు. చేతికి ఆపరేషన్ చేసి రాడ్డు వేశారు. దేవుడు మరణం నుండి నా ప్రాణాన్ని రక్షించాడు. దేవా, నాకు ఇద్దరు కూతుర్లు ఉన్నారు కాని వారు నన్ను చూడటం లేదు. నేనేం చేయాలి. నా పరిస్థితి ఏమిటి? అని చాలా బాధతో ప్రార్థించాను. కాని దేవుడు మీ అందరి మధ్యలో నన్ను ఉంచి మళ్లీ యు.పి.ఎఫ్. సంఘములో ప్రేయర్ వారియర్‌గా రావటానికి ఇచ్చిన ఈ అవకాశాన్నిబట్టి దేవునికి ఎంతో ఋణపడి ఉన్నాను. దేవునికి స్తోత్రములు. అమ్మగారికి వందనములు. ❀

## ప్రేయర్ సెల్ లీడర్స్ మీటింగ్

2023 సెప్టెంబరు 18వ తారీఖు సోమవారము ఉ॥ 9 గం॥ల నుండి మ॥ 3 గం॥ల వరకు "ప్రేయర్ సెల్ లీడర్స్ మీటింగ్" రాంనగర్ యు.పి.ఎఫ్. ప్రార్థనా గోపురంలో జయకరంగా జరిగింది. అదే రోజున రెవ. డా॥ జాయ్ చెరియన్ అమ్మగారు 19 ప్రేయర్ సెల్స్‌ని ప్రారంభించి, నామకరణం చేశారు.

ప్రేయర్ సెల్ లీడర్స్‌కి సలహాలు, సూచనలు ఇచ్చి శాలువ కప్పి, నూనె రాసి అభిషేక ప్రార్థన చేశారు. ప్రేమ విందు ఏర్పాటు చేశారు.

సమస్త ఘనత మహిమ దేవునికే చెల్లును గాక!

## చిల్డ్రన్స్ రిట్రీట్

2023 సెప్టెంబరు 19వ తారీఖు మంగళవారము ఉ॥ 9 గం॥ల నుండి సా॥ 5 గం॥ల వరకు "చిల్డ్రన్స్ రిట్రీట్" రాంనగర్ యు.పి.ఎఫ్. ప్రార్థన గోపురంలో జయకరంగా జరిగింది.

పిల్లలందరు పాటలతో దేవుణ్ణి స్తుతించి మహిమపరచారు. టీచర్లు ఆటలతో, పప్పెట్ షోలతో పిల్లలను అబ్బుర పరుస్తూ దేవుని మాటలను తెలియజేశారు.

ఎక్కువైన సంతోషం (The Great Joy) అనే అంశంపై పిల్లలకు బైబిల్ పాఠాలను బోధించారు. పిల్లలందరికి నూనె రాచి ప్రార్థన చేశారు.

ప్రేమ విందు ఏర్పాటు చేశారు.

సమస్త మహిమ ఘనత దేవునికే చెల్లును గాక!

## స్త్రీల సదస్సు

2023 అక్టోబరు 2వ తారీఖున సోమవారము ఉ॥ 9 గం॥ల నుండి సా॥ 4 గం॥ల వరకు వి.ఎస్.టి. ఫంక్షన్ హాల్, ఆర్.టి.సి. కళ్యాణ మండపం ఎదురుగా, బాగ్‌లింగంపల్లిలో జరిగిన "స్త్రీల సదస్సు" జయకరంగా జరిగింది. దేవాది దేవుణ్ణి పాటలతో స్తుతించి ఆరాధించి మహిమపరచారు. సామెతలు 31:17 నుండి **"ఆమె శక్తి కలిగినది"** అనే అంశంపై రెవ. డా॥ జాయ్ చెరియన్ అమ్మగారు మరియు సిస్టర్ మంజుల చరణ్ గారు వాక్య సందేశాన్ని ఇచ్చారు.

అలాగే సామెతల గ్రంథమునుండి స్త్రీలకు క్విజ్‌ని నిర్వహించి గెలుపొందిన వారికి విలువైన, ప్రత్యేకమైన బైబిల్‌ని, నగదును బహుకరించారు. అలాగే ఆటలు, స్కిట్స్‌లతో స్త్రీలను ఉత్సాహపరచి గెలుపొందిన వారికి బహుమతులను ఇచ్చి ప్రోత్సహించారు.

ప్రతి స్త్రీ దేవుని జ్ఞానంతో నింపబడితే ఆమె శక్తివంతురాలుగా తీర్చబడుతుంది అని తెలియజేశారు. ప్రేమ విందు ఏర్పాటు చేశారు. సదస్సుకు వచ్చిన ప్రతిఒక్కరికి అమ్మగారు నూనె రాచి ప్రార్థన చేశారు.

# యు.పి.ఎఫ్. ఆధ్యాత్మిక రచనలు

జాయ్ చెరియన్ గారు రచించిన పుస్తకములు మీకు అందుబాటులో ఉన్నవి. యు.పి.ఎఫ్. ఆఫీసులో మీకు లభ్యమగును. పోస్టుద్వారా కావలసినవారు పుస్తకాల వెలతోపాటు పోస్టల్ ఛార్జీ అదనంగా యం.ఓ. ద్వారా పంపగలరు.

**ఈ క్రింది పుస్తకములు కావలసినవారు మా చిరునామాను సంప్రదించండి :**

1) **"దేవుని వెయ్యి నామములు" - Vol - I to X** — **వెల రూ. 150/- (each one)**
   1–100 ప్రసంగాల పుస్తకము (తెలుగు)
2) **"దేవుని వెయ్యి వాగ్దానములు" - Vol - I** — **వెల రూ. 150/-**
   1–100 ప్రసంగాల పుస్తకము (తెలుగు)
3) **"దేవుని వెయ్యి ఆదేశములు" - Vol - I to III** — **వెల రూ. 150/- (each one)**
   1–100 ప్రసంగాల పుస్తకము (తెలుగు)
4) **"హృదయ పరీక్ష"** 40 ప్రసంగాల పుస్తకము (తెలుగు) — **వెల రూ. 150/-**
5) **"అద్భుత కార్యములు" - Vol - I to IV** — **వెల రూ. 150/- (each one)**
6) **"విశ్వాసి యాత్ర కీర్తనలు"** (1000 పాటలు) — **వెల రూ. 150/-**
7) **"జీవపు మాటలు" పుస్తకము** (తెలుగు మరియు ఇంగ్లిషు) — **వెల రూ. 20/-**
8) **"దైవిక స్వస్థత" పుస్తకము** (తెలుగు మరియు ఇంగ్లిషు) — **వెల రూ. 20/-**
9) **"నన్ను మలిచిన నా దేవుడు"** జాయ్ చెరియన్‌గారి అనుభవసాక్ష్యము(తెలుగు) — **వెల రూ.20/-**
10) **"పక్షిరాజు" పుస్తకము** (తెలుగు మరియు ఇంగ్లిషు) — **వెల రూ. 20/-**
11) **"రహస్య పాపములు" పుస్తకము** (తెలుగు) — **వెల రూ. 20/-**
12) **"అమ్మ మాటలు" పుస్తకము** (తెలుగు) — **వెల రూ. 20/-**
13) **"మండుచున్న కాగడ" పుస్తకము** (దేవుని పరిచర్యలో స్త్రీలు)(తెలుగు) — **వెల రూ. 20/-**
14) **"తల్లి ఒప్పుకోలు" పుస్తకము** (తెలుగు) — **వెల రూ. 20/-**
15) **"వెయ్యి నామములు" పుస్తకము** (ఇంగ్లిషు మరియు తెలుగు) — **వెల రూ. 20/-**
16) **"వెయ్యి వాగ్దానములు" పుస్తకము** (ఇంగ్లిషు మరియు తెలుగు) — **వెల రూ. 20/-**
17) **"వెయ్యి ఆదేశములు" పుస్తకము** (ఇంగ్లిషు మరియు తెలుగు) — **వెల రూ. 10/-**
18) **"మందిరముకొరకు వాగ్దానములు"** (ఇంగ్లిషు మరియు తెలుగు) — **వెల రూ. 10/-**
19) **"మనము దేనికొరకు ప్రార్థించాలి"** (ఇంగ్లిషు మరియు తెలుగు) — **వెల రూ. 10/-**
20) **"నూతన సంవత్సర క్యాలెండరు"** (తెలుగు మరియు ఇంగ్లిషు) — **వెల రూ. 60/-**

## విశ్వాసులకు విజ్ఞప్తి



**క్రీస్తునందు ప్రియ విశ్వాసులారా,**

నేను ఒక ముఖ్యమైన కార్యము మీతో పంచుకోవాలని ప్రేరణ కలిగియున్నాను. ప్రార్థనకూడా చేయాలని మిమ్మును కోరుతున్నాను. ఎందుకంటే ప్రార్థన అద్భుతాలు చేస్తుంది. ప్రార్థించినప్పుడే మనము ప్రభువుకొరకు గొప్పకార్యాలు చేయగలము. మనము మానవులము కాని దేవుడు తన ఆత్మతో మనలను నింపి దేవునికొరకు ఘనమైన కార్యాలు చేయడానికి వాడుకొంటాడు. **"తమ దేవుని నెరుగువారు బలము కలిగి గొప్ప కార్యములు చేసెదరు."** – దానియేలు 11:32

యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్ (యు.పి.ఎఫ్.) 31 సంవత్సరముల నుండి ప్రజలకు సేవలు అందిస్తుంది. యు.పి.ఎఫ్.కు ఒక సొంత మందిరమంటూ లేదు. ఇంతవరకు ఆరాధన మందిరం కట్టబడలేదు కాని మా తండ్రి పాస్టర్ ఎ.ఎన్. మాథ్యూగారు నిర్మించిన ఆలయంలో ఆరాధన జరుగుతూ వచ్చింది. పట్టజాలనంత జనాలు వచ్చినప్పుడు ఫంక్షన్ హాల్స్‌లో ఆరాధనలు జరిపించాము. కాని ఇప్పుడు సమయం వచ్చింది. తప్పకుండా యు.పి.ఎఫ్.కు ఒక ఆలయం నిర్మించాలని ప్రభువు నన్ను ప్రేరేపించాడు. సరియైన స్థలం కొనాలి; మందిరం నిర్మాణం చేయాలి; దేవుడు సహాయకులను మంచి ఆలోచనకర్తలను అనుగ్రహించాలి. పెద్దలందరు కూడి ఈ కార్యాన్ని చేయాలని ప్రార్థిస్తున్నాను.

ఇటీవల యునైడెడ్ పీపుల్స్ ఫెలోషిప్ ట్రస్ట్ బిల్డింగ్ ఫండ్ అని ఒక అకౌంట్ ఏర్పాటు చేశాము. ఎవరినీ బలవంతము చేయడం లేదు. ఇది దైవకార్యము. మీకు ప్రేరణ కలిగిన కొలది దైవకార్యానికి పవిత్రమైన, సంపూర్ణమైన హృదయంతో ఇవ్వాలి. ఎవరి ఒత్తిడిచేతగాని, బలవంతముచేత గాని మనము ఇవ్వకూడదు. కాబట్టి నేను దేవునికి ప్రార్థన చేస్తున్నాను; మీకు తెలియజేస్తున్నాను. దేవుడు మిమ్మును ప్రేరేపించి కార్యము చేయాలి. దేవుడు మిమ్మును ప్రేరేపించిన కొలది ఈ అకౌంట్‌లో మీరు మీ విలువైన విరాళాలు పంపిస్తే ప్రతిపైసా భద్రంగా పొందుపర్చి తప్పకుండా మందిరనిర్మాణానికి వినియోగిస్తామని తెలియజేస్తున్నాను. ఒకవేళ మీరు ఇతర యు.పి.ఎఫ్. బ్యాంక్ ఖాతాల్లోకి పంపినా అది యు.పి.ఎఫ్. బిల్డింగ్ ఫండ్ అకౌంట్‌లోకి ట్రాన్స్‌ఫర్ చేస్తామని తెలియజేస్తున్నాను.

ముఖ్యంగా మీరు ఈ కార్యంకొరకు ప్రార్థన చేయాలి. యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్‌ద్వారా ఆశీర్వదింపబడినవారు కోకొల్లలుగా ఉన్నారు. మనము ఎక్కువగా ప్రకటనలు చేసి ఎప్పుడూ గొప్పలు చెప్పుకోలేదు. దేవుడు మన ప్రయత్నాలు చూస్తున్నాడనే విశ్వాసం నాకు ఉన్నది. 31 సంవత్సరాలు మీరు యు.పి.ఎఫ్. ద్వారా ఆశీర్వదింపబడ్డారు. కావున మీరు తప్పకుండా యు.పి.ఎఫ్. యెడల కృతజ్ఞులైయుండాలి. దీవింపబడినవారికి నేను తెలియజేస్తున్నాను. మీకు తప్పకుండా యు.పి.ఎఫ్. పట్ల ఒక కర్తవ్యం ఉంది. తప్పకుండా మీరు మీ శాయశక్తుల సహాయపడాలి. నేను ప్రభువు ప్రేరణతో మీకు ఈ విషయం తెలియజేస్తున్నాను. ప్రభువు–**"నన్ను ప్రేమించువారిని ఆస్తికర్తలుగా చేయుదును వారి నిధులను నింపుదును."** – సామెతలు 8:21 అనే వాగ్దానమును నాకు గుర్తు చేశాడు. మనము ప్రభువును ప్రేమిస్తున్నాము; సేవిస్తున్నాము; ఆయన మాటకు విధేయులౌతున్నాము కావున తప్పకుండా ఈ కార్యం జరుగుతుందని నేను విశ్వసిస్తున్నాను. మీరుకూడా దేవుడు నా దర్శనం నెరవేర్చునట్లు ప్రార్థించాలని కోరుతున్నాను. దేవునికి సమస్తం సాధ్యమని నేను హృదయపూర్వకముగా నమ్ముచున్నాను. దేవుడు మిమ్ముల నందరినీ ఆశీర్వదించును గాక!

## United Peoples Fellowship Trust Building Fund Account

Bank and Account Details

**Account Name : United People's Fellowship Trust Building Fund**

**A/c No. : 630501062130** | **Bank : ICICI - Himayat Nagar Branch** | **IFSC Code : ICIC0006305**

RNI. No. APTEL 2007/24270



# యు.పి.ఎఫ్. కార్యక్రమాలు

**1. ఆదివారము ప్రభాత తెలుగు ఆరాధన :**
ఉ॥ 6.00 గం॥ల నుండి 9.00 గం॥ల వరకు

**సాయంకాల తెలుగు ఆరాధన :**
సా॥ 6.00 గం॥ల నుండి రా॥ 9.00 గం॥ల వరకు
స్థలం : వి.ఎస్.టి. ఫంక్షన్ హాల్, బాగ్ లింగంపల్లి రోడ్, హైదరాబాద్ - 500 020.

**యు.పి.ఎఫ్. ఆలయంలో** ఉ॥ 6.00 గం॥లకు మరియు సా॥ 6.00 గం॥లకు **డిజిటల్ సర్వీస్** జరుగును.

**ఇంగ్లీషు మరియు హిందీ ఆరాధన :**
సా॥ 4.00 గం॥ల నుండి 6.00 గం॥ల వరకు
**జూమ్‌లో మాత్రమే జరుగును.**

**సండే స్కూల్ :** ఉ॥ 6.00 గం॥ల నుండి 9.00 గం॥ల వరకు
స్థలం : వి.ఎస్.టి. ఫంక్షన్ హాల్,
బాగ్ లింగంపల్లి రోడ్, హైదరాబాద్ - 500 020.

**2. సోమవారము:**
**తల్లుల సహవాసము, మెన్స్ ఫెలోషిప్, మండే స్కూల్**
సా॥ 6.00 గం॥ల నుండి రా॥ 9.00 గం॥ల వరకు

**3. మంగళవారము : యంగ్ ఉమెన్స్ ఫెలోషిప్**
సా॥ 6.00 గం॥ల నుండి రా॥ 8.00 గం॥ల వరకు

**4. బుధవారము : తేనెధారలు కార్యక్రమము**
సా॥ 6.00 గం॥ల నుండి రా॥ 9.00 గం॥ల వరకు

**5. గురువారము : వాలంటీర్స్ మీటింగ్**
సా॥ 7.00 గం॥ల నుండి రా॥ 8.30 ని॥ల వరకు

**6. శుక్రవారము :**
**ప్రభాత ఆరాధన -** ఉ॥ 5.00 గం॥లకు
**గ్రాండ్ పేరెంట్స్ మీటింగ్ -** ఉ॥ 10.00 గం॥లకు
**శుక్రవారము ఉపవాస ప్రార్థన -** సా॥ 6.00 గం॥లకు

**7. శనివారము :**
**యౌవనస్థుల కూడిక & మెన్స్ ఫెలోషిప్**
సా॥ 6.00 గం॥ల నుండి రా॥ 9.00 గం॥ల వరకు
స్థలం : యు.పి.ఎఫ్. ఆలయం, రాంనగర్‌లో జరుగును.

**24/7 నిరంతర ప్రార్థనలు**
రాత్రింబవళ్ళు, నిరంతరము జూమ్‌ద్వారా ప్రార్థనలు జరుగును

ప్రతి నెల చివరి బుధవారము **సంపూర్ణ రాత్రి ప్రార్థన**
సమయం : రా॥ 9.00 గం॥ల నుడిం ఉ॥ 5.00 గం॥ల వరకు
స్థలం : సెంటినరి బాప్టిస్టు చర్చి, క్లాక్ టవర్ దగ్గర, సికింద్రాబాద్.

ప్రతి నెల మొదటి ఆదివారము **కుటుంబ ఆదివారము**
సమయం: ఉ॥ 6.00 గం॥లకు మరియు సా॥ 6.00 గం॥లకు
స్థలం : వి.ఎస్.టి. ఫంక్షన్ హాల్, బాగ్ లింగంపల్లి రోడ్, హైదరాబాద్.

ప్రతి నెల చివరి ఆదివారము **కృతజ్ఞత స్తుతి ఆరాధన**
సమయం : ఉ॥ 6.00 గం॥లకు మరియు సా॥ 6.00 గం॥లకు
స్థలం: వి.ఎస్.టి. ఫంక్షన్ హాల్, బాగ్ లింగంపల్లి రోడ్, హైదరాబాద్.

ప్రతి సం॥ జనవరి 26వ తేది **ఫ్యామిలీ రిట్రీట్**
ఉ॥ 9.00 గం॥ల నుండి సా॥ 5.00 గం॥ల వరకు
స్థలం : ఉస్మానియా గార్డెన్ ఫంక్షన్ హాల్,
జామై ఉస్మానియా రైల్వేస్టేషన్ ఎదురుగా, అడిక్‌మెట్, హైదరాబాద్.

ప్రతి సం॥ ఆగస్టు 15వ తేది: **వన్‌డే యూత్ రిట్రీట్** మరియు
ప్రతి సం॥ అక్టోబర్ 02వ తేది **ఉమెన్స్ రిట్రీట్**
ఉ॥ 9.00 గం॥ల నుండి సా॥ 5.00 గం॥ల వరకు
స్థలం: వి.ఎస్.టి. ఫంక్షన్ హాల్, బాగ్‌లింగంపల్లి రోడ్, హైదరాబాద్.

## జీవపు మాటలు టి.వి. కార్యక్రమాలు

1. **ఆరాధన ఛానల్ :** ప్రతి రోజు మ॥ 2.00 గం॥లకు
2. **శుభవార్త ఛానల్ :** సోమవారము నుండి శుక్రవారము వరకు ఉ॥ 8.00 గం॥లకు, ప్రతి శుక్రవారము మ॥ 2.30 ని॥లకు ప్రతి శనివారము మ॥ 12.00 గం॥లకు
3. **కల్వరి ఛానల్ :** ప్రతి రోజు ఉ॥ 9 గం॥లకు & 10.30ని॥లకు

**జాయ్ చెరియన్ గారు దైవ వర్తమానమును అందించెదరు. వీక్షించి, దైవాశీర్వాదము పొందండి. ఈ కార్యక్రమము కొనసాగించుటకు ప్రార్థించండి, సహకరించండి.**

| ప్రతి నెల మొదటి గురువారం **24 గంటలు స్తుతి ఆరాధన** ఉ॥ 6.00 గం॥ల నుండి మరుసటి రోజు ఉ॥ 6.00 గం॥ల వరకు | ప్రతి నెల రెండవ శనివారము **ప్రత్యేక ఉపవాస ప్రార్థన** సమయం: ఉ॥ 9 గం॥ల నుండి సా॥ 5.00 గం॥ల వరకు |
|---|---|
| స్థలం : రాంనగర్, యు.పి.ఎఫ్. ఆలయంలో | |

సేవలో పాలుపొందండి
7901236907

**యు.పి.ఎఫ్. పరిచర్య కొరకు ప్రార్థించగలరు:**
Zoom Meeting ID: 9550504718 Code :7777
E-mail id: joycherian@hotmail.com www.upf.org.in
Youtube / Joy Cherian - Upf
Facebook / Joy Cherian - Upf
Instagram / Joy Cherian - UPF
9550504718

Owned, Edited, Printed & Published by : JOY CHERIAN, United People's Fellowship,
# 1-9-52/E/3, Opp. Ramnagar e-seva Gowtham High School Lane, Third Right Turn,
Ramnagar, Hyderabad - 500 020, (T.S.), INDIA. Ph : 9550504718, 9030757571
Printed at : Sandhya Printing Works, # 1-7-1002/7/4/8, Ramnagar 'X' Road, Hyderabad - 500 020. Ph : 27619862